


# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 18-06-2026 | సంపుటి - 29 | సంచిక -24 | రూ : 4 | పేజీలు: 8


## బ్యాంకులపై ఆర్‌బీఐ కొరడా

2లో

## ఇకపై కష్టమర్లదే పైచేయి!



- బ్యాంకుల మిస్ సెల్లింగ్‌పై ఆర్‌బీఐ కఠిన నిబంధనలు
- లోన్ కోసం బీమా పాలసీ కొనాలని బలవంతం చేయొద్దు
- ప్రతి ఉత్పత్తికి విడిగా కస్టమర్ అంగీకారం తప్పనిసరి
- డిజిటల్ వేదికల్లో మభ్యపెట్టే పద్ధతులపై నిషేధం
- 2027 జనవరి 1 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు

## ట్రంప్ ఎదుటే నావికుల భద్రతపై గళమెత్తిన మోదీ



2లో

- జీ7 సదస్సులో భాగంగా ట్రంప్‌తో మోదీ భేటీ
- భారత నావికుల భద్రత తమకు ముఖ్యమన్న ప్రధాని మోదీ
- నావికులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య




## నేడు మొక్కలునాటే పండుగ


2లో


- వనమహోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు
- 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యం
- గుర్రంగూడ ఎకో పార్కులో ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఏర్పాట్లను పరిశీలించిన ఉన్నతాధికారులు
- మొత్తం రూ.35.50 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

## బీటెక్ సీట్లు.. పెరగనున్నాయ్!

- కొత్తగా 15 వేలకు ఏఐసీటీఈ ఆమోదం
- వాటికి అనుమతులివ్వాలని యాజమాన్యాల వినతి
- రెండోవిడత కౌన్సెలింగ్ నాటికే అవకాశం

2లో





## అద్భుతాలు సృష్టిద్దాం.. అండగా నిలవండి

2లో

- నాణ్యమైన విద్యతో రాష్ట్ర పునర్నిర్మాణం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం


## కాంగ్రెస్‌కు విధ్వంసం తప్ప వికాసం తెలియదు



- 20 లక్షల ఇళ్లు కట్టాకే పొంగులేటి ఓట్లు అడగాలి
- భూమి-శిస్తు పెట్టి రైతులను మళ్లీ ఇబ్బంది పెడతారా?
- రాష్ట్రాన్ని సీఎం, మంత్రులు దోచుకుంటున్నారు
- పాలేరు భారాస కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ఆరోపణ

2లో

## దేశాన్ని వణికిస్తున్న 'ఎల్ నినో' ముప్పు.. తెలుగు రాష్ట్రాల్లో వర్షాలకు కొరత



- ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 12 రాష్ట్రాలపై ఎల్ నినో ప్రభావం
- ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన కేంద్ర వ్యవసాయ మంత్రి
- ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచన

2లో



## వైట్‌హౌస్‌పై బాంబు డ్రోన్లు, స్నైపర్లతో దాడికి ప్లాన్.. ముందే పసిగట్టి ముంచేసిన ఎఫ్‌బీఐ

- వైట్‌హౌస్ ఈవెంట్‌పై దాడి కుట్ర భగ్నం
- ఐదుగురు ఉగ్ర కుట్రదారుల అరెస్ట్
- ట్రంప్ పుట్టినరోజే దాడికి స్కెచ్
- నిందితుడి తల్లి సమాచారంతో గుట్టురట్టు

2లో



# అద్భుతాలు సృష్టిద్దాం... అండగా నిలవండి

హైదరాబాద్ : ''గత ప్రభుత్వ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని నాణ్యమైన విద్య ద్వారా పునర్నిర్మించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభిస్తున్నాం. ఇది ఆరుట్ల గ్రామానికే కాదు.. రాష్ట్రానికే గర్వకారణం. ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులు భవిష్యత్తులో ఇంజినీర్లు, డాక్టర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులుగా ఎదగాలి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. అందుకే కేజీ నుంచి ఇంటర్ వరకు ఉన్న ఈ తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను విద్యార్థులకు అంకితమిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించి భవిష్యత్తులో అద్భుతాలు సృష్టిద్దామని పేర్కొన్నారు. 'మీరంతా అండగా ఉండాలి. మా ప్రభుత్వం విద్య కోసం ఏటా రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోంది' అని వివరించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో రూ.15 కోట్లతో టీసీఎస్ సంస్థ సహకారంతో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. ''భవిష్యత్తు పునర్నిర్మాణం తరగతి గదుల్లోనే ఉందన్న నమ్మకంతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను అందుబాటులోకి తీసుకువస్తున్నాం. తొలి ప్రయత్నంగా ఆరుట్లను ఎంపిక చేసుకున్నాం. ఈ ఊరికి చెందిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి.. నిజాంకు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. విద్యార్థులు వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి. మన యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఫ్యూచర్ సిటీలో స్కిల్స్ యూనివర్సిటీని డిసెంబరు 9న ప్రారంభిస్తున్నాం.

**ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధిద్దాం**

దక్షిణ కొరియాకు వెళ్లినప్పుడు ఒక స్పోర్ట్స్



యూనివర్సిటీని చూశా. అక్కడ చదువుకుంటున్న విద్యార్థులు ఒలింపిక్స్‌లో 16 బంగారు పతకాలు సాధించారు. ఆ స్ఫూర్తితోనే మన విద్యార్థులు, క్రీడారత్నాలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించాం. 2034 ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధిద్దాం. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందికి ఆరాధ్యుడైన ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీని హైదరాబాద్ తీసుకువస్తే.. ప్రతిపక్షాలకు కడుపు మండింది. ఉప్పల్ స్టేడియంలో మెస్సీతో మన చిన్నారులు ఫుట్‌బాల్ ఆడారు. ఆ ఘటన వారికి జీవితాంతం మధురానుభూతిగా ఉంటుంది.

* **విద్యార్థులకు నాణ్యమైన వస్తువులు ఇస్తున్నాం..**

ప్రభుత్వ పాఠశాలలు, సమీకృత గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్నవారికి 9 రకాల నాణ్యమైన వస్తువులతో కూడిన కిట్ అందిస్తున్నాం. ఇందుకోసం రూ.687 కోట్లు వెచ్చిస్తున్నాం. ఐపీఎస్ హోదాను అనుభవించిన ఒకాయన.. ఇందులో రూ.3 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఇది ఎంతవరకూ సమంజసమో ఆయనే తెలుసుకోవాలి. విద్యార్థుల కోసం స్కూల్ బ్యాగ్ సహా 9 వస్తువులు ఇస్తున్నాం. అధికారులు విడతలవారీగా జులై నెలాఖరు వరకు వీటిని పంపిణీ చేస్తారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ లాంటి వ్యసనాల బారిన పడకుండా కార్యాచరణ రూపొందించాం. ఈ నెల 19న ఎల్బీ స్టేడియంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా సమక్షంలో.. విద్యార్థులతో 'డ్రగ్స్ జోలికి వెళ్లబోం' అంటూ ప్రమాణం చేయిస్తాం. ఎవరైనా గంజాయి తాగినట్టు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి'' అని సీఎం సూచించారు.

### ట్రంప్ ఎదుటే నావికుల భద్రతపై
## గళమెత్తిన మోదీ

ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ నావికుల భద్రత అంశాన్ని బలంగా ప్రస్తావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన సందర్భంగా, ఇటీవలే అమెరికా జరిపిన సైనిక దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనను ఆయన పరోక్షంగా గుర్తుచేశారు. వేలాది మంది భారత నావికుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, వారికి తగిన రక్షణ కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. పశ్చిమాసియాలో శాంతి స్థాపన దిశగా జరుగుతున్న ప్రయత్నాలను ప్రధాని స్వాగతిస్తూనే, అక్కడి ఉద్రిక్తతల కారణంగా భారత పౌరులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రపంచ వాణిజ్యం కోసం దేశాలను అనుసంధానించే నావికుల భద్రత మనందరి ఉమ్మడి బాధ్యత. సముద్ర వాణిజ్య మార్గాలు సురక్షితంగా ఉండేలా చూస్తూ, వారు ఎటువంటి భయాందోళనలు లేకుండా విధులు నిర్వహించే వాతావరణాన్ని కల్పించాలి" అని మోదీ ఉద్ఘాటించారు. హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు జరుగుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలోనే కీలకమైన వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. హర్మూజ్ జలసంధి వద్ద ఎటువంటి ఆంక్షలు ఉండకూడదని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం నిరంతరాయంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఇటీవల ఒమన్ సమీపంలో ఒక వాణిజ్య నౌకపై అమెరికా జరిపిన సైనిక దాడిలో భారతీయ సిబ్బంది మరణించిన ఘటనపై భారత్ ఇప్పటికే అమెరికాకు దౌత్యపరంగా తన నిరసనను తెలియజేసింది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భారతీయులు నావికులుగా సేవలందిస్తున్న నేపథ్యంలో, సంఘర్షణ ప్రాంతాల్లో వారి భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# బీటెక్ సీట్లు పెరగనున్నాయ్!

హైదరాబాద్: రాష్ట్రంలో ఈసారి కూడా బీటెక్ సీట్ల సంఖ్య కొంత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. గత ఏడాది కన్వీనర్, యాజమాన్య కోటా సీట్లు కలిపి 1,25,345 ఉన్నాయి. ఈసారి కొత్త కోర్సులు, ఇప్పటికే ఉన్న కోర్సుల్లో అదనపు సీట్ల కోసం పలు కళాశాలలు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ)కి దరఖాస్తు చేశాయి. ఆ ప్రకారం 15 వేల సీట్లను ఏఐసీటీఈ మంజూరు చేసింది. వాటికి రాష్ట్ర ప్రభుత్వం నిరభ్యంతర ధ్రువపత్రం (ఎన్‌వోసీ) ఇవ్వాల్సి ఉంది. ఆయా సీట్లకు అనుమతి ఇవ్వాలంటూ ఇప్పటికే సంబంధిత కళాశాలల యాజమాన్యాలు ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించినట్లు సమాచారం. ''ఒకవైపు ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీలు పెద్దమొత్తంలో సీట్లు భర్తీ చేసుకుంటున్నాయి. మాకు మాత్రం సీట్లు పెంచడం లేదు. ఫీజులు కూడా పెంచకపోగా.. తగ్గిస్తున్నారు. ఇక బకాయిలూ ఇవ్వడం లేదు. మొత్తానికి మా కాళ్లు, చేతులు కట్టేస్తున్నట్లవుతోంది'' అని వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మాత్రం ఇప్పటికే కంప్యూటర్ సైన్స్, ఐటీ సంబంధిత బ్రాంచీల్లో 70% సీట్లున్నాయని, ఈసారి కోర్ బ్రాంచీలకు కొంత డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున మళ్లీ సీఎస్ఈ సంబంధిత సీట్లు పెంచడం అవసరమా.. అన్న కోణంలో ఆలోచిస్తోంది. కాగా సాంకేతిక విద్యాశాఖ ఆయా వర్సిటీల నుంచి ఏ కళాశాల ఎన్ని అదనపు సీట్లు అడుగుతోంది.. ఆ కళాశాలల్లో ప్రవేశాల తీరు, నాణ్యమైన విద్య అందించే పరిస్థితి తదితర అంశాలపై సమాచారం అడిగింది. దానిపై సమాచారం అందిన వెంటనే సమగ్ర నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించనున్నారు. తనిఖీ చేసిన తర్వాతే... ఇంతవరకు జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలను తనిఖీ చేసినా.. అవి గతఏడాది బ్రాంచీలు, సీట్ల ఆధారంగానే పూర్తిచేశాయి. ఇప్పుడు కొత్త కోర్సులు, అదనపు సీట్లు వస్తే మళ్లీ తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఆ సీట్లకు అనుగుణంగా అధ్యాపకులు, ల్యాబ్‌లు, ఇతర నిబంధనలు పాటిస్తేనే కొత్త సీట్లకు అనుమతి దక్కుతుంది. ఒకవేళ అదనపు సీట్లు వచ్చినా రెండోవిడత కౌన్సెలింగ్‌లో మాత్రమే అవి చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నెల 19 నుంచి తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవుతుంది. 25 నుంచి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. కాగా గతఏడాది సైతం రెండోవిడత కౌన్సెలింగ్‌లో 7,650 సీట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

### వైట్‌హౌస్‌పై బాంబు డ్రోన్లు, స్నైపర్లతో దాడికి ప్లాన్..
## ముందే పసిగట్టి ముంచేసిన ఎఫ్‌బీఐ

అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసమైన వైట్‌హౌస్ సౌత్ లాన్‌లో భారీ ఎత్తున నిర్వహించిన 'యూఎఫ్‌సీ ఫ్రీడమ్ 250' మార్షల్ ఆర్ట్స్ ఈవెంట్‌ను టార్గెట్ చేస్తూ జరిగిన ఒక ఘోర ఉగ్ర కుట్రను అమెరికా భద్రతా సంస్థ ఎఫ్‌బీఐ విజయవంతంగా భగ్నం చేసింది. ఈ వేడుకకు హాజరైన ప్రముఖులు, ప్రభుత్వ అధికారులపై పేలుడు పదార్థాలతో కూడిన డ్రోన్లు, స్నైపర్ గన్‌లతో దాడి చేసేందుకు ప్లాన్ చేసిన ఐదుగురు నిందితులను భద్రతా బలగాలు అరెస్ట్ చేశాయి. ఓహియో, మిస్సోరి, నెబ్రాస్కా, కాలిఫోర్నియా రాష్ట్రాల్లో జరిపిన మల్టీస్టేట్ ఆపరేషన్‌లో వీరంతా పట్టుబడినట్లు జస్టిస్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. అన్‌సీల్డ్ కోర్టు పత్రాల ప్రకారం.. ప్రభుత్వ వ్యతిరేక కుట్ర సిద్ధాంతాలతో ప్రభావితమైన ఈ ముఠా.. మార్చి నుంచి 'సిగ్నల్' ఎన్‌క్రిప్టెడ్ యాప్ ద్వారా ఈ దాడికి స్కెచ్ వేసింది. జూన్ 14 15 తేదీల్లో జరిగిన ఈ ఈవెంట్.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 80వ పుట్టినరోజు వేడుకలతో కూడుకున్నది కావడంతో దీనిని వారు టార్గెట్ చేశారు. వైట్‌హౌస్ ఉత్తర భాగంలోని భవనాలపై డ్రోన్లతో బాంబు దాడి చేసి తొక్కిసలాట సృష్టించాలని, ఆ భయంతో ప్రాణాలు రక్షించుకోవడానికి పరుగులు తీసే వీవీఐపీ ప్రయాణికులను ముందే సిద్ధం చేసుకున్న స్నైపర్ల ద్వారా కాల్చి చంపాలని, అవసరమైతే వైట్‌హౌస్ గేట్లను బద్దలు కొట్టుకుని లోపలికి చొరబడాలని వీరు ప్లాన్ చేశారు. అయితే, జూన్ 10వ తేదీన నిందితుల్లో ఒకరి తల్లి ఇచ్చిన ముందస్తు సమాచారంతో ఎఫ్‌బీఐ, సీక్రెట్ సర్వీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈవెంట్ ప్రారంభానికి ముందే నిందితులైన టైసెన్ ప్రోపర్ (19), బ్రయాన్ ఒమర్ రోవా, మైఖేల్ అలాన్ థామస్, డేనియల్ ఎస్క్రిడ్జ్, అబ్రహం హెర్మోసిల్లో అల్వారెజ్‌లను పట్టుకుని వారి నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వేల మంది ప్రేక్షకులు, అధ్యక్షుడు ట్రంప్, యూఎఫ్‌సీ సీఈవో డానా వైట్ సమక్షంలో ఈవెంట్ ప్రశాంతంగా ముగిసింది. ఈ దేశీయ ఉగ్ర నెట్‌వర్క్‌తో సంబంధమున్న మరో 23 మందిని గుర్తించేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.

### దేశాన్ని వణికిస్తున్న 'ఎల్ నినో' ముప్పు..
## తెలుగు రాష్ట్రాల్లో వర్షా లకు కొరత

హైదరాబాద్: రైతులకు, వ్యవసాయ రంగానికి ఆందోళన కలిగించే ఒక కీలక అప్‌డేట్ వాతావరణ శాఖ నుండి వచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దేశంలోని దాదాపు 12 రాష్ట్రాలపై 'ఎల్ నినో' తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా అప్రమత్తమైంది. ఖరీఫ్ 2026 సన్నద్ధతపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాధారణం కంటే తక్కువగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని కీలక వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలపై ప్రభావం ఉంటుందని తెలిపింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, ఝార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో, శివరాజ్ సింగ్ చౌహాన్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు తగ్గితే రైతులు నష్టపోకుండా ఉండేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో ఉన్న జిల్లా అధికారులు, రాష్ట్రాల వ్యవసాయ విభాగాలు, కృషి విజ్ఞాన్ కేంద్రాలు, ఇతర అనుబంధ సంస్థలతో తక్షణమే సమన్వయ సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. కరువు లాంటి పరిస్థితులు ఎదురైతే ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

# కాంగ్రెస్‌కు విధ్వంసం తప్ప వికాసం తెలియదు

ఏదులాపురం : ఆరు గ్యారంటీల పేరిట ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి.. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి, మంత్రులు దోచుకుంటున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని వెంకటగిరి వద్ద బుధవారం పార్టీ బీఎల్ఏలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హిట్లర్ తనకు ఆదర్శమని చెప్పుకొంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నారని, తన అనుచరుల ప్రయోజనాలు, రియల్ దందా కోసం ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో వెయ్యి ఇళ్లు కూలగొట్టించారని ఆరోపించారు. విధ్వంసం తప్ప.. కాంగ్రెస్‌కు వికాసం తెలియదని దుయ్యబట్టారు. రైతులను భూమిశిస్తు పేరిట గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పీల్చిపిప్పి చేస్తే.. భారాస హయాంలో కేసీఆర్ దాన్ని తొలగించారని, ఇప్పుడు మళ్లీ రైతులపై భూమిశిస్తు భారాన్ని మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని కేటీఆర్ ఆరోపించారు. ''ఖమ్మం నుంచి కరీంనగర్ వరకు, ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు ఎక్కడికి వెళ్లినా.. ఎవరిని కదిలించినా ఒక్కటే మాట.. మళ్లీ సీఎంగా కేసీఆర్ రావాలని. ఈ విషయంలో ముఖ్యమంత్రికి, మంత్రులకు స్పష్టత ఉంది. అందుకే దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే ధోరణిలో దందాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో రెవెన్యూ పడిపోతుంటే.. ఆ శాఖ మంత్రి అవినీతి సామ్రాజ్యం వందల, వేల రెట్లుగా పెరిగిపోతోంది. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంటే.. ఆ శాఖ మంత్రి అక్రమాలు రోజుకొకటి బయటపడుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంటే.. ఆ శాఖ మంత్రి ఆదాయం, కమీషన్ల దందా జోరుగా సాగుతోంది.

**దివాలా స్థితిలో ఖమ్మం జిల్లా..**

రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లు ఇచ్చాకే తాను వచ్చి ఓట్లడుగుతానని ఇచ్చిన హామీకి మంత్రి పొంగులేటి కట్టుబడి ఉండాలి. రాష్ట్రంలో కోటి ఎకరాలను వివాదాస్పద జాబితాలో పెట్టి వాటిని దోచుకుంటున్నారు. రెండేళ్ల కిందట పొంగులేటి నివాసంపై ఈడీ దాడి చేసి రూ.వందల కోట్లు పట్టుకున్నా.. కనీసం ఒక ప్రకటన, కేసు కూడా లేదు. దీనిపై భాజపా, కాంగ్రెస్ పార్టీలు ఎందుకు మాట్లాడడంలేదు? శ్రీనివాసరెడ్డి చీకట్లో అదానీ, మోదీల వద్ద మోకరిల్లడమే కారణమా? పొంగులేటి అక్రమాలను భారాస కార్యకర్తలు ఇంటింటికీ ప్రచారం చేయాలి. ముగ్గురు మంత్రులున్న ఖమ్మం జిల్లా ఇప్పుడు దివాలా తీసే పరిస్థితికి వచ్చింది. భారాస పాలనలో ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టును 80 శాతం పూర్తిచేసి పాలేరు ప్రాంతానికి నీళ్లు తీసుకొచ్చాం. ఖమ్మం జిల్లాకు మెడికల్, నర్సింగ్ కాలేజీలు, అనేక గురుకులాలొచ్చాయి.

### బ్యాంకులపై ఆర్‌బీఐ కొరడా
## ఇకపై కస్టమర్లదే పైచేయి!

ఢిల్లీ : బ్యాంకుకు ఓ పనిమీద వెళ్తే మరో ప్రొడక్ట్‌ను అంటగట్టడం, లోన్ తీసుకోవాలంటే బీమా పాలసీ తప్పనిసరి అని చెప్పడం, మొబైల్ యాప్ తెరిస్తే వరుసగా లోన్ ఆఫర్లు చూపించడం వంటి పద్ధతులకు త్వరలో చెక్ పడనుంది. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆర్‌బీఐ కఠిన నిబంధనలను తీసుకొచ్చింది. బ్యాంకులు అనుసరించాల్సిన కొత్త మార్గదర్శకాలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటి వరకు బ్యాంకింగ్ రంగంలో తరచూ వినిపించిన ఫిర్యాదుల్లో 'మిస్ సెల్లింగ్' ఒకటి. అంటే వినియోగదారుడికి అవసరం లేని ఫైనాన్షియల్ ప్రొడక్ట్‌ను అమ్మడం. సరైన సమాచారం ఇవ్వకుండా ఒప్పించడం. అనుమతి లేకుండానే పాలసీలు లేదా ఇతర సేవలు జత చేయడం వంటి చర్యలు ఇందులోకి వస్తాయి. ఇలాంటి వ్యవహారాలకు తొలిసారి స్పష్టమైన నిర్వచనం ఇచ్చిన ఆర్‌బీఐ వాటిపై కఠిన వైఖరి అవలంబించింది. కొత్త నిబంధనల ప్రకారం రుణం మంజూరు చేయాలంటే తప్పనిసరిగా బీమా పాలసీ కొనాలని బ్యాంకులు షరతు విధించకూడదు. గృహ రుణం లేదా వ్యక్తిగత రుణం తీసుకునే సమయంలో బీమా అవసరమైతే వినియోగదారుడు తనకు నచ్చిన సంస్థ నుంచి పాలసీ తీసుకునే స్వేచ్ఛ ఉండాలి. బ్యాంకు సూచించిన సంస్థ నుంచే కొనాలంటూ ఒత్తిడి చేయడం నిషేధం. వినియోగదారుడి సమ్మతికి కూడా కొత్త నిర్వచనం తీసుకొచ్చింది ఆర్‌బీఐ. ఒక ఉత్పత్తికి ఇచ్చిన అంగీకారాన్ని మరో ప్రొడక్ట్‌ను వర్తింపచేయకూడదు. రుణం తీసుకున్న వ్యక్తికి అదే ఆధారంగా బీమా, పెట్టుబడి పథకాలు లేదా ఇతర ఆఫర్లను పంపడం కుదరదు. ప్రతి ఉత్పత్తికి విడిగా స్పష్టమైన అనుమతి తీసుకోవాల్సిందే. డిజిటల్ వేదికల్లో బ్యాంకులు అనుసరిస్తున్న పలు పద్ధతులపై కూడా ఆర్‌బీఐ దృష్టి పెట్టింది. కస్టమర్లను మభ్యపెట్టేలా కౌంట్‌డౌన్ టైమర్లు చూపించడం, ముందుగానే టిక్ చేసిన ఆప్షన్స్ ఉంచడం, తిరస్కరించే బటన్‌ను గందరగోళంగా చూపించడం, మూసివేయాలనుకుంటే లోన్ పేజీకి తీసుకెళ్లే పాప్‌అప్‌లు చూపించడం వంటి పద్ధతులను నిషేధించింది. లోన్ దరఖాస్తు సమయంలో వినియోగదారుడికి తెలియకుండా బీమా పాలసీని జత చేయడం, చివరి దశలో అదనపు ఛార్జీలను చూపించడం, అత్యవసర హెచ్చరికలా కనిపించే ప్రకటనలు పంపించడం వంటి చర్యలు కూడా ఇక అనుమతించబోవడం లేదు. బ్యాంకుల తరఫున పనిచేసే డైరెక్ట్ సెల్లింగ్ ఏజెంట్లు, మార్కెటింగ్ ప్రతినిధులపైనా కొత్త నియంత్రణలు అమల్లోకి రానున్నాయి.

# నేడు మొక్కలునాటే పండుగ

హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం 2026కు అటవీ శాఖ విస్తృత స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసింది. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ ఎకో పార్కులో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గురువారం వనమహోత్సవ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అటవీ దళాల అధిపతి (పీసీసీ ఎఫ్) వినయ్ కుమార్, సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్, పొల్యూ షన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రెటరీ గుగులోతు రవి తదితర ఉన్నతాధికారులు గుర్రంగూడ ఎకో పార్కును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికా రులతో సమన్వయం చేస్తూ చేపట్టాల్సిన పనులపై సూచన లు చేశారు. వేదిక ఏర్పాటు, వీఐపీ ప్లాంటింగ్ ఏరియా, పార్కింగ్, భద్రత, తాగునీటి సదుపాయాలు, సందర్శకుల నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహిం చారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, ప్రజా ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా సీఎం ఎ. రేవంత్ రెడ్డి నాగలింగం మొక్క నాటి వనమహోత్సవాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ నేరేడు మొక్కను నాటనున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారు లు, విద్యార్థులు, స్థానిక ప్రజలు కూడా మొక్కలు నాటి హరిత తెలంగాణ సాధనలో భాగస్వాములు కానున్నారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 13,242 నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 6.18 కోట్ల మొక్కలు, హెచ్ఎండీఏ పరిధిలో 4.50 కోట్ల మొక్కలు నాటనుండగా, అటవీ శాఖ ఆధ్వర్యంలో 89.59 లక్షల మొక్కల పెంపకం, నాటకం చేపట్టనుంది. గత మూడు దశాబ్దాలుగా న్యాయ వివాదాలలో చిక్కుకున్న గుర్రంగూడ పార్క్ సుప్రీం కోర్టు తీరుతో అటవీ శాఖ చట్టబద్ధంగా గుర్తిస్తూ రిజర్వ్ ఫారెస్ట్ గా ప్రకటించిన విషయం తెలిసిందే..

# మిషన్ భగీరథ పనుల జాప్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

* లీకేజీలను అరికట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలి
* అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించిన ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మిషన్ భగీరథ పైపులైన్ పనుల జాప్యంపై ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పాల్వంచ పట్టణ పరిధిలో జరుగుతున్న మిషన్ భగీరథ పైపులైన్ పనులతో ధ్వంసం అయిన రోడ్లను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా కూనంనేని రోడ్ల ధ్వంసం, పైప్‌లైన్ల లీకేజీలపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు అవస్థలు పడుతున్నా నిర్లక్ష్యం వీడరా అని అధికారులను ప్రశ్నించారు. సమస్య తీవ్రతను గుర్తించి స్పందించకపోవడం సరైందికాదనీ, తక్షణమే పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి ప్రజల ఇబ్బందులు తొలగించి లీకేజీలను అరికట్టి నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లో మళ్లీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తానని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని హెచ్చరించారు. అంబేద్కర్ సెంటర్‌లో తక్షణమే సిమెంట్ రోడ్ నిర్మించాలని, ప్రధాన జాతీయ రహదారి అయినందున ట్రాఫిక్ సమస్య రాకుండా అన్ని శాఖల సమన్వయంతో రోడ్ నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, ఇంచార్జీ కమిషనర్ విజయానంద్, ఎలక్ట్రికల్ ఏడీఈ అబ్దుల్ రెహమాన్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామ కీర్తి, గొర్రె అన్నపూర్ణ, వివిధ శాఖల డిఈలు, ఏఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటీలో మంచి ర్యాంకు సంపాదించడం అభినందనీయం



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని జయశంకర్ కాలనీకి చెందిన కిష్టపురం సాయి ప్రణవ్ ఇటీవల వెలువడిన ఐఐటి పరీక్ష ఫలితాల్లో జాతీయస్థాయిలో 11569 ర్యాంకును సాధించిన సందర్భంగా ఆయనకు బుధవారం రోజు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి మెమొంటోను అందజేశారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కుటుంబం నుండి ఐఐటీలో మంచి ర్యాంకు సంపాదించడం ఎంతో అభినందనీయమని అన్నారు. కష్టపడి చదివి మంచి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రికి జాతికి గ్రామానికి పేరు ప్రతిష్టలు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెజ్జంకి రవీంద్ర చారి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అమ్ముల సాగర్ భైంసా పట్టణ కోశాధికారి చిలుముల అశోకవర్ధన చారి కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ చారి కలికోట సాయినాథ్ ఎర్రోజు ఆనంద్ కట్ట లవన్ రంగు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## తెరమీద పొంగులేటి శ్రీనివాసరెడ్డి అక్రమాల చిట్టా చుడండి

* బహిరంగ సభలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : పొంగులేటి శ్రీనివాసరెడ్డి అవినీతి అక్రమాలను చూడండి అని తెరమీద 2024 లో ఈడి దాడులలో నోట్ల కట్టలు లెక్కించే యాత్రలను వాడారను వార్తలు వచ్చాయని పాలేరు బహిరంగ సభలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ గుర్తుచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పొంగులేటి శ్రీనివాసరెడ్డి అవినీతి అక్రమాలపై ఈడి, కాంగ్రెస్, బీజేపీ,ఎందుకు మౌనంగా ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేసారు. అదేవిదంగా ఖమ్మంలో ముగ్గురు మంత్రులు మూటలు పంచుకోటానికే గాని ప్రజల బాధలు వారికీ అవసరం లేదని వారిపై విరుచుకపడ్డాడు.

## ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

: ఎస్పీ రోహిత్‌రాజు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించే సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. ప్రతినిత్యం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. జిల్లా ఆర్మడ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజ్ మహమూద్ కుటుంబానికి బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో రూ. 1 లక్ష విలువ చేసే చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మరణించిన పోలీసుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వం తరపున అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో మంజ్యా నాయక్, పోలీస్ అధికారుల సంఘం సభ్యుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల.. కాంగ్రెస్ తోనే సాధ్యం

* నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం
* చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నిరుపేదలకు సొంత ఇల్లు నిర్మించుకోవాలనే కల.. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 17వ వార్డులో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న చెన్నోజు మదనాచారికి చెందిన ఇందిరమ్మ ఇల్లును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మున్సిపల్ వ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లుతో వారి కల నెరవేరుస్తామన్నారు. మున్సిపల్ వ్యాప్తంగా ప్రతి వార్డులో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న నిరుపేదల కళ్ళల్లో సంతోషం వర్ణించలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు, కోఆప్షన్ మెంబర్ పస్తం గంగరాములు, కాసోజు గోవర్ధనాచారి, మాదని గోపాల్, పెద్దగోని రమేష్‌గౌడ్, వీరమల సత్తయ్య, ఎస్ కే యూసుఫ్, ముత్యాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా అభివృద్ధి – పరిపాలనా పారదర్శకత పై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

* కేజీబీవీలో ఆన్ అకాడమీ తరగతుల ప్రారంభం.
* తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ




జనగామ, ప్రజాస్ఫూర్తి : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, క్రమబద్ధత పెంపొందించడం పై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక దృష్టిసారించారు. బుధవారం మండలంలోని కేజీబీవీ, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి పలు సూచనలు చేశారు. బండ్లగూడెం కేజీబీవీ లో ఆన్ అకాడమీ ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించిన కలెక్టర్, విద్యార్థులు గణితం, సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్ వంటి ప్రధాన సబ్జెక్టుల పై పట్టు సాధించాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించు కుంటూ ఉన్నత విద్య, పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ప్రోత్సహించారు. పాఠశాల పరిశుభ్రత, వంటశాల నిర్వహణ, పోషకాహార భోజనాల పై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి గణితం లోని పలు అంశాలను స్వయంగా బోధించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, కార్యాలయాన్ని పరిశుభ్రంగా, క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. రికార్డులు, ఫైళ్లను విభాగాల వారీగా భద్రపరచాలని, రికార్డు రూమ్ నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కార్యాలయం లోని అన్ని కీలక కార్యకలాపాలు సీసీ కెమెరాల పరిధిలో జరిగేలా చూడాలని తెలిపారు. ప్రజలకు తాగునీరు, కూర్చునే సౌకర్యం, సమాచార బోర్డులు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించిన కలెక్టర్, ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

## ఎరువులు, విత్తనాల దుకాణాల మ్యాపింగ్ వేగవంతం చేయాలి

* నకిలీ విత్తనాల విక్రేతలపై కఠిన చర్యలు: కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో ఎరువులు, విత్తనాలు విక్రయించే అన్ని దుకాణాల మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో వ్యవసాయ, సహకార, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న 38 రైతు వేదికల ద్వారా ఎరువులు, విత్తనాల విక్రయాలు చేపట్టాలని సూచించిన కలెక్టర్.. ఇప్పటివరకు 15 రైతు వేదికల మ్యాపింగ్ పూర్తయిందని, మిగిలిన 23 వేదికల మ్యాపింగ్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి విక్రయాలు ప్రారంభించాలని ఆదేశించారు. యూరియాను యాప్ ద్వారా బుక్ చేసుకుని పొందే విధానంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం సాగు విధానాలపై రైతుల్లో చైతన్యం పెంచేందుకు కళాజాత కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

**నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం**

నకిలీ విత్తనాల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నకిలీ విత్తనాల విక్రయం గుర్తిస్తే పోలీసు కేసులు నమోదు చేసి, సంబంధిత లైసెన్సులను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించారు. ప్రతి విక్రయ కేంద్రంలో మండల స్థాయి అధికారి, పోలీసు పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

**ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేయాలి**

జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు 66.77 శాతమే పూర్తవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, మిగిలిన నమోదును త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సాంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, సహకార శాఖ అధికారి వాలియా నాయక్, ఏడీఏలు రమేష్, శ్రీపాల్‌తో పాటు మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## బ్రతుకులనే బలితీసుకుంటున్న గౌడ కుల వృత్తి

* ముగ్గురు గౌడన్నల బ్రతుకుల్లో విషాదం బాధాకరం సమ్మిగౌడ్ చిలువేరు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: కేసముద్రం మండలంలో వరుసగా జరుగుతున్న గీత కార్మికుల ప్రమాదాలు గౌడ కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బ్రతుకుదెరువు కోసం చేపట్టిన గౌడ వృత్తి నేడు బ్రతుకులనే బలి తీసుకుంటోందని అన్నారు. కుటుంబ పోషణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి తాటి చెట్లను నమ్ముకొని జీవనం సాగిస్తున్న గౌడన్నలు అదే తాటి చెట్ల కారణంగా ప్రాణాలు కోల్పోతుండటం అత్యంత బాధాకరమన్నారు. తమ భర్తలు పొద్దున వృత్తి రీత్యా బయటకు వెళ్లిన వాళ్ళు తిరిగి నవ్వుతూ ఇంటికి వచ్చే వరకు తాళి చేతిలో పట్టుకొని చూసే వాళ్ళ ఎదురుచూపులు మాటల్లో వర్ణించలేనివని ఆవేదన వ్యక్తం చేసారు. గత కొద్ది రోజుల వ్యవధిలోనే కేసముద్రం మండలంలో చోటుచేసుకున్న వరుస ప్రమాదాలు పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయన్నారు. కేసముద్రం గ్రామానికి చెందిన ఉట్కూరి శ్రీనివాస్ గౌడ్ తాటిచెట్టుపై నుంచి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు మెదడులో రక్తం గడ్డకట్టిందని, చేతులు, కాళ్లు విరిగిపోయి ప్రస్తుతం హన్మకొండలోని ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇంటికన్నె గ్రామానికి చెందిన సార రాజు తాటిచెట్టుపై నుంచి కిందపడటంతో వెన్నెముక, పక్కటెముకలు విరిగి తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమై చికిత్స పొందుతున్నారని అన్నారు. కల్వల గ్రామానికి చెందిన వేముల మల్లేశం తాటిచెట్టుపై నుంచి జారిపడి మృతి చెందడం గౌడ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్, మోడెం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉదయం కుటుంబం కోసం పనికి వెళ్లిన గౌడన్న సాయంత్రానికి క్షేమంగా ఇంటికి చేరుతాడో లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రకృతి ఇచ్చిన తాటి చెట్టును నమ్ముకొని తరతరాలుగా జీవిస్తున్న గౌడన్నలు నేడు అదే తాటి చెట్లపై ప్రాణాలు కోల్పోతున్నారు. పూట గడవాలంటే చెట్టు ఎక్కాలి. ప్రాణం దక్కాలంటే అదృష్టం ఉండాలి అనే పరిస్థితి గౌడ కుటుంబాలను వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేసారు. మృతి చెందిన వేముల మల్లేశం కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారి కుటుంబానికి తక్షణ సహాయం కింద ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కొరారు. అలాగే ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న ఉట్కూరి శ్రీనివాస్ గౌడ్, సార రాజులకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా తోపాటు వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వం భరించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రతి గీత కార్మికుడికి నాణ్యమైన సేఫ్టీ బెల్టులు, భద్రతా పరికరాలు, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా అందించాలని డిమాండ్ చేశారు.

## పాఠశాల,కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక తనిఖీలు

* విద్యార్థుల భద్రతలో రాజీ లేదు-మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లా పోలీసు శాఖ, రవాణా శాఖ సంయుక్తంగా పాఠశాల, కళాశాల బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాయి. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ఆదేశాల మేరకు జిల్లాలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు తమ పరిధిలోని విద్యాసంస్థల బస్సులను రవాణా శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేస్తున్నారు. ఈ తనిఖీల్లో బస్సుల ఫిట్‌నెస్, బ్రేకులు, టైర్ల పరిస్థితి, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ డోర్, జీపీఎస్, సీసీ కెమెరాలు తదితర భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నిర్దేశిత నిబంధనలను పాటించని వాహనాలపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులకు సురక్షితమైన ప్రయాణ వాతావరణం కల్పించేందుకు అన్ని విద్యాసంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

## ప్రభుత్వ ప్లీడర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా ప్రధాన న్యాయస్థానం లో ప్రభుత్వ ప్లీడర్ పోస్టు కు తాజా ప్యానెల్ రూపొందించేందుకు అర్హులైన న్యాయవాదుల నుంచి దరఖా స్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నియామ క ప్రక్రియ చేపడుతున్నట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు నోటిఫికేషన్ తేదీ నాటికి కనీసం 10 సంవత్సరాల బార్ అనుభవం కలిగి ఉండటంతో పాటు జిల్లా కోర్టుల్లో సక్రియంగా న్యాయవాద వృత్తి నిర్వహిస్తూ ఉండాలి. ప్రభుత్వాని కి లేదా ప్రభుత్వ అనుబంధ సంస్థలకు వ్యతిరేకంగా కోర్టులు, ట్రిబ్యునళ్లలో హా జరు కాకూడదని స్పష్టం చేశారు. అభ్య ర్థులు నిర్దేశిత దరఖాస్తు నమూనా, అం డర్‌టేకింగ్, బార్ కౌన్సిల్ నమోదు ధ్రువీ కరణ పత్రం, విద్యార్హతల ధ్రువపత్రాలు, కమ్యూనిటీ సర్టిఫికేట్, గత మూడు సం వత్సరాల కేసుల వివరాలు, ఆదాయ పన్ను రిటర్నులు (ఉంటే), మూడు పా స్ పోర్ట్ సైజు ఫోటోలతో దరఖాస్తు సమ ర్పించాల్సి ఉంటుంది. అర్హులైన న్యాయ వాదులు తమ దరఖాస్తులను అవసర మైన పత్రాలతో జూన్ 30 వ తేదీ సా యంత్రం 5 గంటల లోపు సమర్పించా లని కలెక్టర్ సూచించారు.

## బాల కార్మికుల కోసం ప్రత్యేక తనిఖీలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏహెచ్‌టీయూ) అధికారులు సంయుక్తంగా ఈ డ్రైవ్ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న భవనాలు, ఇటుక బట్టీలు, రైస్ మిల్లులు, మెకానిక్ షాపులు, స్క్రాప్ షాపులు, బేకరీలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. బాల కార్మికుల సమాచారం తెలిసిన వారు వెంటనే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించి బాల కార్మిక నిర్మూలనకు తోడ్పడాలని సూచించారు.

# తానూర్ మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే

ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా తానూర్ మండల కేంద్రంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పేదల గృహ కలను సాకారం చేసేందుకు కట్టుబడి ఉందని, ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మండల కేంద్రంలో రూ.20 లక్షల ఎంజిఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు.




*** బెంబర్ గ్రామంలో రూ.50 లక్షల చెక్‌డ్యాం నిర్మాణానికి భూమిపూజ**

రైతుల సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా మరో ముందడుగు - ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ బెంబర్ గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న చెక్‌డ్యాం పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయమే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతు బలపడితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. వర్షాకాలంలో వృథాగా వెళ్లిపోతున్న నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాల మట్టం పెరిగి బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడటంతో పాటు రైతులకు సాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని వివరించారు. ప్రస్తుతం తగ్గుతున్న భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నీటి సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. చెక్‌డ్యాంలు, కుంటలు, చెరువుల అభివృద్ధి ద్వారా నీటి వనరులను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల నాయకులు, గ్రామస్తులు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పగ్గాల టెండర్ కం బహిరంగ వేలం వాయిదా

లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి : జిల్లా లోని లింగాల ఘణపురం మండలం, నవాబుపేట లోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించాల్సిన పగ్గాల సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయి దా పడినట్లు ఆలయ కార్యనిర్వహణా ధికారి లక్ష్మీ ప్రసన్న ప్రకటన ద్వారా తెలి పారు. వేలానికి సంబంధించిన నూతన తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆమె పే ర్కొన్నారు. టెండర్ ప్రక్రియ లో పాల్గొన దలచిన వారు తదుపరి ప్రకటన ను గమనించాలని సూచించారు.

# వ్యాపార రంగంలో అభివృద్ధి సాధించాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: వినియోగదారులకు మెరుగైన సేవలను అందించి వ్యాపారంలో అ అభివృద్ధి సాదించాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో బాలాజీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఏర్పాటుచేసిన వైఎల్ఎం లోన్ కన్సల్టెన్సీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో అనుభవం ఉన్న నిపుణులు ఈ కన్సల్టెన్సీ ద్వారా ప్రజలకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం చాలా మంది రుణాల కోసం బ్యాంకులను సంప్రదించే సమయంలో ఏ బ్యాంకులో ఏ రకమైన రుణాలు లభిస్తాయి, వడ్డీ రేట్లు ఎలా ఉంటాయి, నెలవారీ ఈఎంఐలు ఎంత వరకు ఉంటాయి వంటి అంశాలపై పూర్తి అవగాహన లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు సరైన సమాచారం లేకపోవడం వల్ల రుణాల మంజూరులో జాప్యం లేదా తిరస్కరణ వంటి సమస్యలు కూడా తలెత్తుతున్నాయి అన్నారు. వారికి సరైన సమాచారం అందించాలని అన్నారు. ఎల్లమ్మ దేవత ఆశీస్సులతో ప్రారంభమైన ఈ కన్సల్టెన్సీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తూ తమ కాళ్లపై తాము నిలబడేలా ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, కాంగ్రెస్ నాయకులు రెబెల్ శీను, ఆలేటి మాణిక్యం, భార్గవ్, సతీష్, ఉప్పలయ్య, నిర్వహకులు కట్ట ప్రవీణ్ రెడ్డి, పోలేపాక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తోనే.. సొంత ఇంటి కల సాకారం

- **దేవలమ్మ నాగారంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం**
- **సర్పంచ్ సరుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే.. నిరుపేదల సొంతింటి కల సహకారం అవుతుందని సర్పంచ్ సరుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో బొమ్మ సాయిలు విజయ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని బుధవారం ఆమె ప్రారంభించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఫోటోతో బొమ్మ సాయిలు విజయ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిలోకి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరుగు గౌరీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ సొంత ఇంటి కల నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఇందిరమ్మ ఇల్లు అందుబాటులోకి వస్తాయని, ఇల్లు లేని నిరుపేదలకు మంజూరు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ అమరావతి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బొమ్మ మైసయ్య, బొమ్మ రాములు, బొమ్మ బిక్షపతి, బొమ్మ సాలయ్య, చీమకండ్ల గాలయ్య, చింతకింది రమేష్, చీమర్ల గాలయ్య, పెంబళ్ల యాదయ్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల సర్వేను స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,నాక్ష సర్వే పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికై సర్వే కొనసాగుతున్న మహబూబాబాద్ పట్టణంలోని గుమ్మడూరు, జామండ్లపల్లి,తదితర ప్రదేశాలలో కొనసాగుతున్న ఇండ్ల సర్వే ను స్వయంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యల గురించి కలెక్టర్ స్నేహ శబరీష్,ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, లకు తగు సూచనలు జారీ చేశారు.క్షేత్రస్థాయిలో పక్కా సర్వేలు నిర్వహించాలని సూచించారు.ఇప్పటికే సూచించిన ప్రకారం నక్ష సర్వే కొనసాగుతుందని, ల్యాండ్ సర్వే ఏడి శ్రీనివాస్,తహసిల్దార్ రాజేశ్వర్,మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్,తదితరులు కలెక్టర్కు తెలిపారు.

# నిర్మల్ జిల్లాలో ప్రైవేట్ స్కూల్ బస్సులపై రవాణా శాఖ దాడులు

*** కేసుల నమోదు చేసిన రవాణా శాఖ అధికారులు**



ప్రజాస్ఫూర్తి, భైంసా: విద్యార్థుల భద్రతకు పెద్దపీట వేస్తూ, రవాణా శాఖ అధికారులు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాల బస్సులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు.నిబంధనలను ఉల్లంఘిస్తున్న బస్సులపై కఠినచర్యలు, తీసుకుంటామని,విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే వారిని ఉపేక్షించేది లేదని అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో భాగంగా ఐదు కేసులను నమోదు చేశారు. ఖానాపూర్, నిర్మల్, భైంసా, నర్సాపూర్ పరిధిలో చేపట్టిన ఈ మెరుపు తనిఖీలు ప్రైవేట్ విద్యాసంస్థల నిర్లక్ష్యానికి అడ్డుకట్ట వేసేందుకు ఉద్దేశించబడ్డాయి.విద్యార్థుల భద్రతను గాలికొదిలేసి, కేవలం లాభాల ధ్యాసగా నడుస్తున్న బస్సులపై అధికారులు దృష్టి సారించారు. ఈ ఆకస్మిక దాడులు అక్రమాలకు పాల్పడుతున్న వారిలో ఆందోళనసృష్టించాయి. ఖానాపూర్ పట్టణంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆసిఫ్, రవాణా శాఖ సిబ్బందితో కలిసి ప్రైవేట్ స్కూల్ బస్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా, ధ్రువ రక్ష పాఠశాలకు చెందిన ఏడు బస్సులను తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఫిట్‌నెస్ లేని వాహనాలపై చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.ప్రతి స్కూల్ బస్సు తప్పనిసరిగా ఫిట్‌నెస్,ఇన్సూరెన్స్, స్పీడ్ గవర్నర్, సీసీటీవీ కెమెరాలు కలిగి ఉండాలని,అర్హత కలిగిన డ్రైవర్, క్లీనర్‌ను నియమించుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ నిబంధనలను పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అంగన్వాడీ ప్రాథమిక పాఠశాల బలోపేతం కావాలి

*** జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీలు మరింత బలోపేతం కావాలని, అంగన్వాడీలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ,ప్రాథమిక పాఠశాలలను డిఆర్డిఓ, డీఈవో ,డిడబ్ల్యూఓ, గ్రామ సర్పంచ్ తో కలిసి సందర్శించారు. జిల్లా కలెక్టర్ అంగన్వాడి కేంద్రంలోనీ చిన్నారులతో ముచ్చటించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు ప్రాథ మిక పాఠశాలలు మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు అంగన్వాడిలలో, ప్రీ స్కూల్స్ లో, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, త్రాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ లతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. అంగన్వాడీలలో, ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలని, తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపకుండా,ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చి దిద్దాలన్నారు. అంగన్వాడి టీచర్లు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమన్వయంతో విద్యార్థుల వయస్సును బట్టి అంగన్వాడి, ప్రాథమిక పాఠశాలలో నమోదు చేయించాలని అధికారులు ఆదేశించారు. అంతకుముందు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి,ఏ ఎం ఓ సుదర్శన్ మూర్తి, ఎంఈఓ తారా సింగ్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : జూన్ 28 నుండి 30 వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బుధవారం ఐ.డి.ఓ.సి లోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. బి. రవి రాథోడ్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) డా. రవి రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమానికి అవసరమైన వ్యాక్సిన్ పంపిణీ, కోల్డ్ చైన్ నిర్వహణ,బూత్‌ల ఏర్పాటు,సిబ్బంది శిక్షణ, పర్యవేక్షణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, పోలియో బూత్‌లకు వ్యాక్సిన్‌ను సకాలంలో పంపిణీ చేసి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని నిర్ణయించారు.జూన్ 28న పోలియో బూత్‌ల ద్వారా 0-5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనుండగా, జూన్ 29, 30 తేదీలలో ఇంటింటి సందర్శన ద్వారా మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నారు. జిల్లాలో సుమారు 55 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా నిర్ణయించినట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.జిల్లా విస్తరణ మీడియా అధికారి రాజ్‌కుమార్,ఆరోగ్య విద్యాధికారి పురుషోత్తం,సబ్ యూనిట్ అధికారి వి. శ్రీనివాస్, ఆరోగ్య సహాయకులు కె.ఎల్.ఎన్.స్వామి, ఎస్. శ్రీనివాస్, పి. లింగారెడ్డి,అనిల్, సత్యనారాయణ, ఫార్మసిస్ట్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన లక్ష్మీదేవిపల్లి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన ముత్తి వీరభద్రం (40) అనే వ్యక్తి గిరిజన పూజారిగా జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 8వ తేదీన పూజా కార్యక్రమానికి వెళ్తున్నాని తల్లికి చెప్పి వెళ్లాడు. అప్పటి నుండి బుచ్చిరాములు ఆచూకీ లభించకపోవడంతో అతని సోదరుడు ముత్తి సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని గట్టుమల్ల గ్రామంలోగల జామాయిల్ తోటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిందనే సమాచారంతో సుధాకర్ సంఘటన స్థలానికి వెళ్లి చూడగా ఆ మృతదేహం తన సోదరుడు వీరభద్రందే అని గుర్తించాడు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో పోలీసులు దానిని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నిర్ణిత గడువులోగా వంద శాతం ఈకేవైసీ పూర్తి చేయాలి

*** జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్**



ప్రజాస్ఫూర్తి, భైంసా : జిల్లాలో ఎల్‌పీజీ వినియోగదారుల ఈకేవైసీ ప్రక్రియ నిర్వహణపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సంబంధిత అధికారులు, ఎల్పీజీ సరఫరాదారులతో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీలోగా ఈకేవైసీ ప్రక్రియ 100శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు పూర్తిచేసిన ఈకేవైసీ ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఈకేవైసీ పూర్తి చేయని వినియోగదారులను గుర్తించి వారి కోసం ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని సూచించారు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ ల ద్వారా వినియోగదారులకు తెలియజేయాలన్నారు. ప్రతి వినియోగదారుడు సులభంగా ఈకేవైసీ చేయించుకునేలా వీలు కల్పించాలని పేర్కొన్నారు.నిర్ణీత గడువు తేదీ లోపు ప్రక్రియను పూర్తి చేయని ఎల్‌పీజీ సంస్థలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్,ఇతర అధికారులు, సిబ్బంది, ఎల్పీజీ డీలర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి టీకాలు అందించాలి

*** జిల్లా శిశు ఆరోగ్య, టీకాల అధికారి డాక్టర్ ప్రతాప్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: శిశువులు, గర్భిణీలలో అర్హులైన ప్రతి ఒక్కరికి సకాలంలో టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా శిశు ఆరోగ్య, టీకాల అధికారి డాక్టర్ ప్రతాప్ సిబ్బందికి సూచించారు. కొత్తగూడెం పట్టణంలోని పాత కొత్తగూడెం , సఫాయి బస్తీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గురువారం డాక్టర్ ప్రతాప్ సందర్శించి, సాధారణ టీకా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా టీకాల నిల్వ, కోల్డ్ చైన్ నిర్వహణ, యూ-విన్ పోర్టల్‌లో నమోదు వివరాలు, లబ్ధిదారుల హాజరు, వ్యాక్సిన్ వినియోగం, సెషన్ సైట్ నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాకరణ కార్యక్రమాల నాణ్యతను మరింత మెరుగుపరచడంతోపాటు, యూ-విన్ పోర్టల్‌లో వెంటనే నమోదు చేయాలని, ఎటువంటి పెండెన్సీలు లేకుండా చూడాలని సూచించారు. టీకా ద్వారా నివారించగల వ్యాధుల నియంత్రణలో సాధారణ టీకాకరణ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగభూషణం, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఇతర ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిల్లలకు పాఠ్యపుస్తకాలు ఉచిత పంపిచేసిన సర్పంచ్ రామంజి గౌడ్



గరిడేపల్లి , ప్రజాస్ఫూర్తి : రాయనీగూడెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిక్స్ టు టెన్త్ పిల్లలు ప్రైవేట్ స్కూళ్లకి వెళ్లకుండా గవర్నమెంట్ స్కూళ్లకు వెళ్లాలని సదుద్దేశంతో ప్రైవేట్ స్కూళ్లలో క్వాలిఫై లేని టీచర్లు ఉంటారు గవర్నమెంట్ స్కూళ్లలో మంచిగా చదివి ఉద్యోగం సంపాదించి క్వాలిఫై అయిన టీచర్లు ఉంటారు కాబట్టి ప్రతి ఒక్క పిల్లల తల్లిదండ్రులు పిల్లల్ని గవర్నమెంట్ స్కూల్కు పంపియవలసిందిగా సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి శత్రు నాయక్ ఏపిసి చైర్మన్ సుహాసిని గ్రామ కార్యదర్శి సునీత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ నాగమణి , ఉపాధ్యాయుల బృందం పిల్లలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీలో సత్తా చాటిన నారాయణ విద్యార్థులు

* విజేతలకు ఘన సన్మానం చేసిన పాఠశాల యాజమాన్యం




జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రం లోని నారాయణ విద్యాసంస్థలకు చెందిన ఎస్ఎస్సీ 202324 బ్యాచ్ విద్యా ర్థులు ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రవేశ పరీక్షల్లో విజయాన్ని సాధించారు.ఐఐటీలో సీట్లు పొందిన అల్లూరి భరద్వాజ్, జెస్సికా ల ను నారాయణ విద్యా సంస్థల యాజ మాన్యం బుధవారం ఘనంగా సన్మానిం చింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీజీఎం రిజ్వాన్, పాఠశా ల ప్రిన్సిపాల్ ఫర్హానా మాట్లాడుతూ వి ద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గద ర్శకత్వం, తల్లిదండ్రుల సహకారమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు.భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి సంస్థకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హైస్కూల్ కోఆర్డినేటర్లు సాయికృష్ణ,అకాడమిక్ డీన్ విక్రమ్,ఏ. ఓ చారి, ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయంతో నారాయణ విద్యాసం స్థల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

# వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుగా చిట్యాల సోమన్న



పాలకుర్తి/జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని లింగాల ఘణపురం మండల కేంద్రంలో 16వ తేదిన నిర్వహించిన తెలం గాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభలో పాలకుర్తి గ్రామా నికి చెందిన చిట్యాల సోమన్న జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకానికి సంబంధించిన నూతన విధా నాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కార్మికుల కు పనులు దొరకడం కష్టంగా మారింద న్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలీలకు రోజుకు రూ.700 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశా రు. ఉపాధి హామీ పనుల్లో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న రెండుసార్లు ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాల ని, కేంద్ర ప్రభుత్వం పాత విధానంలోనే నిధులను విడుదల చేయాలని కోరారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, పనిస్థలాల్లో కనీస సౌకర్యాలు కల్పించా లని డిమాండ్ చేశారు. గత మహాసభ లో నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకొని,భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్ర భు త్వాల కార్మిక వ్యతిరేక విధానాల పై ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తా మని తెలిపారు. వ్యవసాయ కార్మిక సం ఘాన్ని గ్రామ గ్రామాన విస్తరింపజేసి,సం ఘం చేపట్టే పోరాటాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# కుమ్మర సంఘం రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడిగా కోడూరి చంద్రయ్య నియామకం



ప్ర జా స్ఫూ ర్తి , జన్నారం : తెలంగాణ రాష్ట్ర కుమ్మర్ల సంఘం అధ్యక్షులు ఆకారపు మోహన్ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్ గ్రామం కు చెందిన కోడూరి చంద్రయ్య ను రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడిగా & ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జిగా నియమించినట్లు బుధవారం రోజున నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ నా పై నమ్మకంతో తనను నియమించినందుకు రాష్ట్ర కమిటీ సభ్యులందరికీ, రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్ కి రాష్ట్ర కమిటీ సభ్యులకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. కుమ్మరుల అభివృద్ధికి, గ్రామ కమిటీలు, మండల కమిటీలు, ఏర్పాటుకు తన సాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర కన్వీనర్ ఏనుగు తల యాదగిరి, కో కన్వీనర్ అమరాబాదే సారంగపాణి లకు ధన్యవాదాలు తెలియజేశారు.

# హెయిర్ హౌజ్ బ్యూటీ సెలూన్ ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలోని విద్యా నగర్ లో బుధవారం సాయంత్రం హెయిర్ హౌజ్ బ్యూటి సెలూన్ ను ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వ్యాపార రంగంలో రాణించాలని అన్నారు. సూర్యాపేటకు చెందిన అజయ్ బ్యూటీ సెలూన్ ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మొరిశెట్టి లక్షాది, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, ఫారుక్, బైరు వెంకన్న, రాచకొండ శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కలకోట లక్ష్మయ్య, వంగవీటి రమేష్, యామా సంతోష్, నిర్వాహకులు అజయ్, ఉదయ్, శ్రవణ్, యశ్ ముదిరాజ్, మురళి, సైదులు తదితరులు పాల్గొన్నారు

# నల్లగొండలో ఎన్టీఆర్ విగ్రహం దహనం కేసును ఛేదించిన జిల్లా పోలీసులు

* ఇద్దరు నిందితుల అరెస్టు కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం.
* సీసీటీవీ ఆధారాలతో నిందితులను గుర్తించిన నల్లగొండ పోలీసులు.
* జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్,




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ పట్టణంలో జూన్ 6వ తేదీ తెల్లవారుజామున చోటుచేసుకున్న ఎన్టీఆర్ విగ్రహం దహనం ఘటనను నల్లగొండ టూ టౌన్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి సామాజిక ఉద్రిక్తతలను సృష్టించాలనే ఉద్దేశంతో ఈ ఘటనకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఎన్.జి. కళాశాల సమీపంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినీ నటుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగులబెట్టిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై మున్సిపల్ 48వ వార్డు అధికారి బుజనూరి స్వప్న ఫిర్యాదు మేరకు నల్లగొండ టూ టౌన్ పోలీస్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. నల్లగొండ సీసీఎస్, టూ టౌన్ పోలీసుల సంయుక్త బృందాలు సంఘటన స్థలం పరిసర ప్రాంతాల్లోని వందలాది గంటల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించాయి. అనుమానాస్పద వాహనాల కదలికలు, సాంకేతిక ఆధారాలు, ప్రయాణ వివరాలను విశ్లేషిస్తూ నిందితుల జాడను కనుగొన్నారు.ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలను లక్ష్యంగా చేసుకుని వాటిని ధ్వంసం చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కుట్రలో భాగంగా మొదట నల్లగొండలోని ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎంపిక చేసుకుని, సంఘటనకు ముందు అక్కడి పరిస్థితులను పరిశీలించి, దాడికి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసినట్లు దర్యాప్తులో బయటపడింది. జూన్ 6వ తేదీ తెల్లవారు జామున సుమారు 3:45 గంటల సమయంలో నిందితులు పాలకురి అశోక్ కుమార్ గౌడ్‌కు చెందిన బలెనో కారు లో నల్లగొండకు చేరుకున్నారు. ముందస్తుగా తెచ్చుకున్న రెండు పాత బెడ్‌షీట్లను ఎన్టీఆర్ విగ్రహంపై కప్పి, ఒక లీటర్ పెట్రోల్ పోసి నిప్పంటించి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటన ద్వారా ప్రజల్లో ఆగ్రహం, ఆందోళన రేకెత్తించి ప్రజల మధ్య ఉద్రిక్త పరిస్థితులు సృష్టించాలనే కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు.ఈ కేసులో నిందితులైన పాలకురి అశోక్ కుమార్ గౌడ్ (45), ప్రైవేట్ లెక్చరర్, చైతన్యపురి, హైదరాబాద్ ఎలుకంటి ప్రణీత్ (23), ప్రైవేట్ ఉద్యోగి, మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లాలను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి నేరానికి ఉపయోగించిన బలెనో కారు , రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న డిజిటల్ ఆధారాలను సైతం పోలీసులు విశ్లేషిస్తున్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్పష్టం చేశారు. సామాజిక శాంతి, సామరస్యాలను దెబ్బతీసే కుట్రలను పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసిన డీఎస్పీ కె. శివరాం రెడ్డి, టూ టౌన్ సీఐ ఎస్. రాఘవరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు డి. చంద్రశేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, రూరల్ ఎస్ఐ డి. సైదాబాబు, హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్ గిరి, సీసీఎస్ సిబ్బంది పుష్పగిరి, శివరాజు, సాయి, నరేశ్, నాగార్జున, కమల్, టూ టౌన్ సిబ్బంది బాలకోటి, షకీల్, శంకర్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా నాయకుడు షేక్ యాకోబు డిమాండ్ చేశారు గరిడేపల్లి మండల కేంద్రంలో ఎంపీ ఓ ఇబ్రహీం కి పెండింగ్ వేతనాల విషయంపై ధర్నా చేసి వినతిపత్రం ఇవ్వడం జరిగినది 14 గ్రామపంచాయతీలో గాను మూడు నెలలు నాలుగు నెలలు రెండు నెలలు ఈ విధంగా పెండింగ్ లో ఉన్నాయని సెప్టెంబర్ అక్టోబర్ నెలలో సంబంధించిన వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం ఎన్నికల ముందు జిపి కార్మికులకు ప్రతినెల వేతనాలు తమ అకౌంట్లో వేస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలైనా అమలు కాలేదని అన్నారు మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని అర్హులైన వారందరినీ బిల్ కలెక్టర్ గా నియమించాలని పంచాయతీ సెక్రెటరీగా ప్రమోట్ చేయాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కార్మికుడు చనిపోతే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని 10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ఈ విధానం కొనసాగించాలని అన్నారు ఈ కార్యక్రమంలో శ్రావణ్ కుమార్ లచ్చయ్య పొట్టి వెంకన్న అమరవరపు శ్రవణ్ కుమార్ పొట్టికూటి వెంకటేశ్వర్లు, పోలె అంజిబాబు, కె. నాగరాజు, ఎస్. ప్రసాద్, ఎం. నాగరాజు, కె. వెంకటేశ్వర్లు , బి.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ కంచి షోరూం ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్వర్ణ కంచి షాపింగ్ మాల్, ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి ముఖ్య అతిథిగా హాజరై స్వర్ణ కంచి షాపింగ్ మాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షోరూం మరింత అభివృద్ధి చెందాలని నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం షోరూంలోని జ్యుయలరి, పట్టుచీరల విభాగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, దండు మైసమ్మ ఆలయ చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీరన్న నాయక్, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, కాంగ్రెస్ నాయకులు ఆలేటి మాణిక్యం, బైరు దుర్గయ్య, స్వర్ణ కంచి షాపింగ్ మాల్ డైరెక్టర్ విపుల్ గోయల్, హెడ్ ఆఫీస్ మేనేజర్ వినయ్ అగర్వాల్ , తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు పిల్లలకు ఫీజులో రాయితీ సర్క్యులర్ జారీ చేయండి

* అధికారులకు టీయుడబ్ల్యూజే జిల్లా కమిటీ విజ్ఞప్తి



నల్లగొండ, నల్గొండ జిల్లాలోని జర్నలిస్టు కుటుంబ సభ్యుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలలో ఫీజులో 75 శాతం నుంచి 100 శాతం వరకు రాయితీకి సంబంధించిన సర్క్యులర్ ను వెంటనే జారీ చేయాలని టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. కలెక్టరేట్లో బుధవారం నాడు అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డిఆర్వో దశరథ్ కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఫీజులో రాయితీకి సంబంధించిన సర్క్యులర్ కోసం ఈ నెల 5వ తేదీన జిల్లా విద్యాశాఖ అధికారికి విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. అయితే సాంకేతిక కారణాలతో సర్క్యులర్ జారీ లో ఆలస్యం జరిగిందని తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభమైన దృష్ట్యా పేద మధ్యతరగతి కుటుంబాలు అధికంగా ఉన్న జర్నలిస్ట్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. ఇతర జిల్లాలలో జారీ అయిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకపోవడంతో పాటు అందుకు సంబంధించిన ప్రతులను కూడా అందించారు. జర్నలిస్టుల సంక్షేమం దృష్ట్యా తక్షణమే సర్క్యులర్ జారీకి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంల టీయూడబ్ల్యూజే ఐ జె యు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి , నల్గొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఎలక్ట్రాన్ మీడియా ప్రధాన కార్యదర్శి దోటి శ్రీనివాస్, చిన్న పత్రికల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల రామకృష్ణ. జిల్లా ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి కంచర్ల అంజయ్య, జిల్లా నాయకులు కెమెరామెన్ వినోద్ దశరథ ప్రజాపక్షం. సూరారపు ప్రసాద్ . రమేష్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# నస్తీపూర్‌లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహణ



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం, ప్రజాస్ఫూర్తి : హత్నూర మండలంలోని నస్తీపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు నస్తీపూర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి పాఠశాలలో చేర్పించారు. ప్రధానోపాధ్యాయులు లోకనాథం మాట్లాడుతూ సాధారణంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, సోమవారం అమావాస్య కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను మంగళవారం పాఠశాలలో చేర్చేందుకు ముందుకు రాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రమీల సాయిలు, ఉపసర్పంచ్ మహేందర్, వార్డు సభ్యులు కళ్యాణ్ రాజ్, ప్రధానోపాధ్యాయులు లోకనాథం, ఉపాధ్యాయులు నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు...

# నెంబర్ ప్లేట్లు లేని 53 వాహనాలు స్వాధీనం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:నెంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపై నడుపుతున్న వాహనాలను గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని చలానాలు విధించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, డీఎస్పీ ఆదినారాయణ ఆదేశాల మేరకు కొత్తగూడెం పట్టణంలోని సూపర్ బజార్, రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో నెంబర్ ప్లేట్లు లేని 53 వాహనాలను గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రవీణ్ మాట్లాడుతూ వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకపోవడం వల్ల వాహనాల గుర్తింపు కష్టమవుతుందని, చోరీకి గురైన వాహనాలను గుర్తించడం కూడా సమస్యగా మారుతుందని తెలిపారు. అలాగే ప్రమాదాలు జరిగిన సందర్భంలో నెంబర్ ప్లేట్లు లేని వాహనాలకు ఇన్సూరెన్స్ క్లెయిమ్ పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవడంతోపాటు, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఈ నెల 20వ తేదీన జాతీయ మెగా లోక్ అదాలత్

* అవసరమైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ఎస్సై ఉదయ్ కిరణ్



ప్రజాస్ఫూర్తి , జన్నారం: ఈనెల 20వ తేదీన నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్ ను అవసరం ఉన్న ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జన్నారం ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీమార్గమే రాజ మార్గమని కక్షలు, పొట్లాటలతో ఏమి సాధించలేమని, రాజీ పడితే ఇరువురు కూడా విజయం సాధించినట్లేనని లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాల అంగీకారంతో సత్వర న్యాయం పొందవచ్చునని అన్నారు. లోక్ అదాలత్ ద్వారానే ఇరువురికి సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. రాజీ పడదగిన పలు కేసులు కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, భార్యాభర్తల వివాదాలు, మొదలగు వీటన్నింటిని ఇరువురు రాజీ పడడంతోనే, రాజీమార్గం ద్వారానే సత్వర పరిష్కారం జరుగుతుందని సూచించారు. ఇలాంటి చిన్న చిన్న వివాదాలతో పగలు ప్రతీకారాలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని డబ్బులను వృధా చేసుకోవద్దని సూచించారు. కోర్టు వారు ఇచ్చిన (లోక్ అదాలత్) ఈ అవకాశాన్ని అందరూ కూడా సద్వినియోగం తీసుకోవాలని తెలిపారు.

# విద్యార్థులకు స్కూలు బ్యాగుల వితరణ



ప్రజా స్ఫూర్తి, కూసుమంచి:మండలంలోని తురకగూడెం గ్రామంలో కూసుమంచి ఏం ఈ ఓ వీరస్వామి ఆధ్వర్యంలో ఆశ జ్యోతి ఫౌండేషన్ తరపున ఎంపీపీఎస్ తురకగూడెం పాఠశాల విద్యార్థులకు యాభై స్కూల్ బ్యాగ్స్, బుక్స్ అందజేశారు,ఈ సందర్భంగా స్కూల్ హెడ్ మాస్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ తమ విద్యార్థుల చదువు కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకోని స్కూల్ బ్యాగ్స్ బుక్స్ అందించిన ఆశ జ్యోతి ఫౌండేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపీపీఎస్ తూరకగూడెం పాఠశాల నుండి ప్రతి సంవత్సరం మోడల్ స్కూల్ కు, గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక అవుతున్నందున, విద్యార్థుల సంఖ్యను పెంచినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయ బృందానికి మండల విద్యాశాఖ అధికారి వీరస్వామి అభినందించారు.స్కూల్ బ్యాగులను అందించినందుకు ఆశ జ్యోతి ఫౌండేషన్ వారికి ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య మరియు ఉపాధ్యాయులు సుభాషిణి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కృష్ణ,ఉపాధ్యాయులు మరియు అంగన్వాడీ టీచర్ ఉపేంద్రమ్మ, వార్డు సభ్యులు సుధాకర్, పిట్టయ్య ,సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# గూడు లేని పేదలు ఉండకూడదన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఆశయం

*** అర్హులైన వారందరికీ రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లు**

*** మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏళ్ళ బాల్ రెడ్డి**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: అర్హులైన వారందరికీ రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేస్తామని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏళ్ళ బాల్ రెడ్డి స్పష్టం చేశారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని పోతుగల్ గ్రామంలో తాటకర్ల పద్మ ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడు లేని పేదలు ఉండకూడదన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఆశయమని చెప్పారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణి కార్యక్రమంలో అర్హులైన వారందరికీ ఇండ్ల పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. నిరుపేదల సొంతింటి కలలను సాకారం చేసేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందన్నారు. నూతన గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించిన లబ్ధిదారులకు కేకే మహేందర్ రెడ్డి చిరు కానుకగా పంపిన నూతన పట్టు వస్త్రాలను కాంగ్రెస్ నాయకులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డిలకు లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, ఆరుట్ల మహేష్ రెడ్డి, పోతుగల్ గ్రామ అధ్యక్షుడు అనమేని రాజు, ఉపసర్పంచ్ కోలా కృష్ణ, మాజీ ఎంపీటీసీ బాలకిషన్, మామిండ్ల ఆంజనేయులు, కిరణ్, చెంద్రమౌళి, కేసుగాని రాజయ్య, బండారి సాయి, తాటకర్ల మహేష్, తాటకర్ల వేణు, కేసుగాని తిరుపతి, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి

*** వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి మల్లేశం**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ఈనెల 20,21,22 వ తేదీలలో మహబూబ్ నగర్ జిల్లాలో జరగబోతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లాలోని వ్యవసాయ కార్మికులకు కూలీలకు వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి మల్లేశం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి ఈ మహాసభ వేదిక కాబోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు పోరాటం చేయడానికి, రాష్ట్రంలో కౌలు రైతులకు, భూమి లేని పేదలకు ఇచ్చిన హామీని అమలు చేసే వరకు భవిష్యత్తు పోరాట ప్రణాళికను రూపకల్పన చేయడానికి ఈ మహాసభ వేదిక అవుతుందన్నారు. తెలంగాణలో కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయిస్తుందనీ, కార్మిక చట్టాలు ఉపాధి హామీ చట్టాలను విద్యా విధానం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాటిని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ మహాసభను కూలీలు, కార్మికులు, అర్షకులు సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి

**: మంత్రి అజహరుద్దీన్**




హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదే పేదల కోసమని మంత్రి అజహరుద్దీన్ అన్నారు. గాంధీభవన్‌లో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. ''వివిధ సమస్యలతో ప్రజలు వచ్చారు. సుమారు 200పైగా దరఖాస్తులు అందాయి. సమస్యలపై సాధ్యమైనంత వరకు అక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశా. 50 వరకు సమస్యలను వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరించా. తెలంగాణ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ ఎంతో కష్టపడి పనిచేస్తున్నారు. 'ప్రజలతో ముఖాముఖి' పేరిట పీసీసీ చీఫ్ మంచి కార్యక్రమం పెట్టారు. ప్రతిపక్షంలో ఉన్నందున బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాపం గత ప్రభుత్వానిదే. అయినా ఆ సమస్యను మా ప్రభుత్వం పరిష్కరిస్తుంది. ఎస్ఐఆర్‌పై దృష్టి సారించాం. బిహార్, పశ్చిమ బెంగాల్‌లో ఎక్కువగా మైనార్టీల ఓట్లు తొలగించారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరుతున్నాను. నిజమైన ఓట్లు తొలగించకుండా చర్యలు తీసుకుంటున్నాం'' అని అజహరుద్దీన్ అన్నారు.

# హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం

**: గోవా నెట్‌వర్క్‌ను ఛేదించిన ఈగిల్, టాలీవుడ్‌కు లింకులు!**

హైదరాబాద్, జూన్ 17: గోవా కేంద్రంగా హైదరాబాద్‌కు మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న భారీ నెట్‌వర్క్‌ను తెలంగాణ 'ఈగిల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) దళాలు ఛేదించాయి. ఈ ఆపరేషన్‌లో భాగంగా 19 మంది డ్రగ్స్ వినియోగదారులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ దందాలో టాలీవుడ్ వర్గాలకు కూడా ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో తీవ్ర కలకలం రేగుతోంది. వివరాల్లోకి వెళితే.. 'ఈగిల్' వాట్సాప్ హెల్ప్‌లైన్‌కు అందిన సమాచారంతో అధికారులు లోతైన దర్యాప్తు చేపట్టారు. గోవాలోని వాగేటర్ బీచ్ సమీపంలోని ఒక హాస్టల్‌లో నివసిస్తూ కొమ్మరాజు చక్రపాణి అలియాస్ చక్రి, అతని స్నేహితుడు హర్షిత్ రెడ్డి ఈ నెట్‌వర్క్‌ను నడుపుతున్నట్లు గుర్తించారు. వీరు బెంగళూరు నుంచి కొకైన్, ఎండీఎంఏ పిల్స్, ఎల్ఎస్‌డీ వంటి మాదకద్రవ్యాలను కొనుగోలు చేసి గోవా మీదుగా హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నారు. అదేవిధంగా, ఒడిశా నుంచి హ్యాష్ ఆయిల్‌ను తెప్పించి స్థానికంగా విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. నిందితుల ఫోన్ కాల్స్, డిజిటల్ ఆధారాలను విశ్లేషించిన అధికారులు.. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ (మల్కాజ్‌గిరి), ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో సుమారు 44 మంది వినియోగదారులను గుర్తించారు. జూన్ 15న 15 ప్రత్యేక బృందాలు ఏకకాలంలో దాడులు నిర్వహించి 19 మందిని అదుపులోకి తీసుకున్నాయి. వీరిలో 14 మందికి గంజాయి (టీహెచ్‌సీ), మరొకరికి గంజాయితో పాటు మెథాంపెటమైన్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వీరందరికీ తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించిన పోలీసులు, అనంతరం డీఅడిక్షన్ కేంద్రాలకు తరలించనున్నారు. పట్టుబడిన వారు చక్రి, హర్షిత్ రెడ్డిల నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు విచారణలో అంగీకరించారు. నిందితుల ఖాతాలకు ఇటీవలే సుమారు రూ.3.12 లక్షలు బదిలీ అయినట్లు డిజిటల్ లావాదేవీల ద్వారా స్పష్టమైంది. ముఖ్యంగా చక్రపాణి టాలీవుడ్ సినీ పరిశ్రమకు చెందిన పలువురికి కొకైన్ సరఫరా చేసినట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభకు టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు




జనగామ, ప్రజాస్ఫూర్తి: పట్టణంలోని ధర్మకంచ జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో 2025 26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత కే.ఎల్. ఎన్.స్వామి పాల్గొని విద్యార్థులను అభినందించారు. అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎం. సంయుక్త (557 మార్కులు) కు రూ.5,000, నౌసిక్ ఫాతిమా (527 మార్కులు) కు రూ. 3,000, సాయికుమార్ కు రూ. 2,500, సాయి సిరికిరూ.2,500, దినేష్ కు రూ. 2,000 నగదు బహుమతులను అందజేశారు. కే.ఎల్. ఎన్. స్వామి మాట్లాడుతూ విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, విద్యార్థులు కష్టపడి చదివి తల్లి దండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.కనకయ్య మాట్లాడుతూ ఫౌండేషన్ అందించిన ప్రోత్సాహకాలు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని, ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల విజయానికి అంకితభావంతో కృషి చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్‌రాజు, ప్రతినిధులు పండుగ నరేష్, నల్ల వినోద్, బింగి నరసింహులు, సిద్దిరాల నవీన్, కోడం మణి, పాఠశాల ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.


# ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి

**: బీఆర్ఎస్**




జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రత్యేక చొరవతో సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ కింద కుత్బుల్లాపూర్ డివిజన్ వాజ్ పేయ్ నగర్ కి చెందిన కట్టా సాయికుమార్ రూ.2.00 లక్షలు, ఛండా చంద్రశేఖర్ రూ.1.00 లక్షలు, సుభాష్ నగర్ డివిజన్ సూరారం రాజీవ్ గృహకల్ప కు చెందిన షేక్ నన్నే సాహెబ్ రూ.2.00 లక్షలు, నిజాంపేట్ సర్కిల్ బత్తుల రజని రూ.3.50 లక్షలు మంజూరు చేయించిన సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన నాయకులు బుధవారం చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ కార్యాలయంలో లబ్ధిదార కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతీ పేదవారికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రజా సేవకై పనిచేసే నాయకులు మన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అని అన్నారు. కావున అర్హులైన ప్రతీ పేదవారు మెరుగైన వైద్యం కోసం ఎల్వోసీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, పోలే శ్రీకాంత్, దేవరకొండ శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు బలరాం రెడ్డి, కిషోర్ చారి, నార్లకంటి బాలయ్య, దుర్గారావు, సుందర్, కోల శ్రీకాంత్ ముదిరాజ్, ఎండి.నసీరుద్దీన్, సాంబ శివరెడ్డి, తాల్లూరి ప్రదీప్ కుమార్, రమణారెడ్డి, ఆంజనేయులు, వెంకటేష్, మధుకర్ రెడ్డి, కొత్త నరసింహారెడ్డి, నల్ల వేణు, రాజు గౌడ్, లలితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాసర, ముధోల్ మండల కేంద్రలలో పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, అనంతరం ముధోల్ మండల కేంద్రంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనానికి శంకుస్థాపన మరియు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పరిశుభ్రతను మరింత మెరుగుపర్చేందుకు చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన నూతన వాహనాలను ప్రారంభించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్ఠాత్మక గృహ నిర్మాణ పథకమైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో మరమ్మతులు చేపట్టి ఆధునీకరించిన పోస్టుమార్టం గదులను పునఃప్రారంభించారు. గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన నూతన బోర్‌వెల్‌ను కూడా ప్రారంభించారు. ముధోల్ లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన ఎమ్మెల్యే, ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు, మౌలిక వసతులు, పారిశుధ్య సదుపాయాలు, తాగునీటి సౌకర్యాలు అందించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల కుదింపును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి

*** సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేరని నేపముతో 16 వేల పాఠశాల నుండి 4000 పాఠశాలకు కుదించడానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తప్పుపట్టారు. సోమవారం నల్లగొండలోని జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు ఇబ్బడి ముబ్బడిగా పెంచుతుంటే చూస్తూ ఊరుకుంటుందని వాటిని నియంత్రించడానికి రాష్ట్ర శాసనసభల్లో ప్రవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నందున ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసే పాఠ్యపుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు వారికి కావలసిన అన్ని మౌలిక సదుపాయాలని కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర విద్యా కమిషన్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం అన్ని ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికనురూపొందించాలని కోరారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ అన్ని ప్రభుత్వ వైద్యశాలలో అవసరమైన మందులతో పాటు తగిన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని రాష్ట్రప్రభుత్వాన్ని ప్రత్యేకంగా కోరారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నోటిఫికేషన్లను విడుదల చేయాలని చెప్పారు. గతంలో ఉన్న బారాస గాని, నేటి కాంగ్రెస్ గాని, 12 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రణాళిక బద్ధంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్లను విడుదల చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో యువజన సమ్మేళనం హైదరాబాద్లో నిర్వహిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం నిర్వహించే ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితాను ఎలాంటి భావ ద్వేషాలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా చేపట్టాలని సిపిఎం కోరుతుందన్నారు. ఎన్నికల సంఘం సర్ పేరుతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో అర్హులైన ఓటర్లను కూడా తొలగించారని గుర్తు చేశారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా వ్యవహరిస్తుందని తెలిపారు. తెలంగాణలో నిర్వహించే సర్ పారదర్శకంగానిర్వహించాలన్నారు. గ్రామ మున్సిపల్ కేంద్రాల్లో అన్ని పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఓటర్ల జాబితాను తయారు చేయాలని కోరారు. జూన్, జూలై, ఆగస్టు మాసాలలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విద్యా, వైద్యం, నిరుద్యోగం, రేషన్ షాపుల్లో 14 రకాల వస్తువులను సరఫరా చేయాలని స్థానిక సమస్యలపై సర్వేలు ఆందోళన పోరాటాలు నిర్వహించాలని సిపిఎం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైనది కాబట్టి అన్ని రకాల ఎరువులు విత్తనాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో సగం విడుదల చేసిన రైతు భరోసా తో పాటు ఖరీఫ్ రైతు భరోసానిధులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూరియా అమ్మకం యాప్ ను రద్దు చేయాలని కోరారు. అన్ని షాపుల్లో అన్ని వ్యవసాయ పరపతి సంఘాలలో యూరియా డిఏపి రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు.

# పిల్లల భవిష్యత్తుకు అంగన్వాడీయే తొలి పునాది

*** ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత**



జనగామ, ప్రజాస్ఫూర్తి: మండలం లోని గానుగుపహాడ్, మరిగడి గ్రామాల్లో పాఠశాలల పునఃప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా అంగన్వాడి రెండవ సెంటర్ లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాని నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు దడిగ పద్మ, యాకలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ పిల్లల విద్యాభ్యాసానికి అంగన్వాడీ కేంద్రాలే తొలి మెట్టు అని, ఇక్కడి నుంచే వారి ఉన్నత భవిష్యత్తుకు బలమైన పునాదులు పడతాయని అన్నారు. పిల్లల విద్య, ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు అంగన్వాడి కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా వార్డు సభ్యులు ధండ్ల లతా కృష్ణ అంగన్వాడి కేంద్రానికి పిల్లల కోసం ఫ్యాన్‌ను బహుకరించారు. అనంతరం పిల్లల యోగక్షేమాలను తెలుసుకుని వారికి ఆశీస్సులు అందించారు. కార్యక్రమం లో సర్పంచ్ అనూష, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బుచ్చమ్మ, ఉపాధ్యాయురాలు సీ.హెచ్ సుకన్య, ఆయమ్మలు లక్ష్మి, సత్తెమ్మ, గర్భిణీలు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దర్శిని నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే




ప్రజా స్ఫూర్తి, భైంసా: భైంసా పట్టణంలో నర్సింగ్ విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన దర్శిని నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళాశాల భవనాన్ని ప్రారంభించి, విద్యా సంస్థ నిర్వాహకులను అభినందించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన నర్సింగ్ విద్య అందుబాటులోకి రావడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో నైపుణ్యం కలిగిన నర్సింగ్ సిబ్బందికి ప్రస్తుతం విస్తృత అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. నర్సింగ్ విద్య ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు సమాజానికి సేవ చేసే అవకాశం కూడా లభిస్తుందని ఆయన అన్నారు. ఈ కళాశాల భైంసా, పరిసర ప్రాంతాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం అతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

# ఎస్సీ కార్పొరేషన్ నుంచి ఒక్కరికీ రుణం ఇవ్వలేదు

**: హరీశ్‌రావు**



హుస్నాబాద్: ఎస్సీ కార్పొరేషన్ నుంచి గత 30 నెలల్లో ఒక్కరికి కూడా రుణం ఇవ్వలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ''ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల నిధుల విషయంలో కేసీఆర్ ఆనాడు చట్టం చేశారు. ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించారు. పోడు భూములకు పట్టాలివ్వడంతో పాటు రైతుబంధు ఇచ్చి.. ఎస్టీలను అక్కున చేర్చుకున్నారు. ఆనాడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరం తెలంగాణ కోసం రాజీనామా చేశాం. రేవంత్‌రెడ్డి కూడా రాజీనామా చేసి స్పీకర్‌కు జిరాక్స్ పేపర్ ఇచ్చారు. తెలంగాణ కోసం ఏనాడు పోరాడని వ్యక్తి ఇవాళ సీఎం అయ్యారు'' అని హరీశ్‌రావు విమర్శించారు.



# బాస్ పేరిట మెసేజ్.. ఐనాక్స్‌కు రూ.10.4కోట్లు ఫట్!

ముంబయిలోని ఐనాక్స్ కంపెనీకి కొందరు కేటుగాళ్లు టోకరా వేశారు. బాస్‌లా బురిడీ కొట్టించి.. రూ.10 కోట్లకు పైగా కాజేశారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఐనాక్స్ కంపెనీలోని అకౌంట్స్ విభాగంలో గిరీష్ అమిన్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల ఆరంభంలో అతడి ఫోన్‌కి గుర్తు తెలియని నంబర్ నుంచి వాట్సప్ సందేశం వచ్చింది. దాన్ని పంపిన వ్యక్తి తనని తాను కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిద్ధార్థ్ జైన్‌గా పరిచయం చేసుకున్నాడు. అది తన వ్యక్తిగత నంబర్ అని.. దాన్ని ఎవరికీ ఇవ్వొద్దని తెలిపాడు. ఆ నంబర్‌కు సంబంధించి డీపీ కూడా జైన్ ఫొటో ఉండటంతో ఆ ఉద్యోగి అది బాస్ నంబరేనని నమ్మేశారు. అత్యవసరంగా ఓ మీటింగ్‌కు వెళ్తున్నా అని చెప్పి.. ఓ బ్యాంకు ఖాతాకు నగదు బదిలీ చేయాలని ఆ నకిలీ బాస్ ఆదేశించాడు. దీంతో, నిజంగా తన బాస్ అనుకొని ఆ ఉద్యోగి రూ.46.5 లక్షలను పంపించారు. ఇలా జూన్ 3 నుంచి 15 మధ్య బాస్ అని నమ్మించిన వ్యక్తికి 63 సార్లు దాదాపు రూ. 10.4 కోట్లు మేర బదిలీ అయ్యాయి. ఇటీవల అకౌంట్స్ చెక్ చేసే సమయంలో.. ఈ నకిలీ బాస్ వ్యవహారం బయటపడింది. ఈ ఘటనపై ఉద్యోగి ఫిర్యాదు మేరకు ముంబయి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన సమాచారం ఆధారంగా నలుగురిని అరెస్టు చేశారు. ఈ నెట్‌వర్క్‌లో మరికొంత మంది ప్రమేయం ఉన్నట్లు భావిస్తున్న పోలీసులు.. తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# గుండెపోటుతో బాడీబిల్డర్ మృతి

దావణగెరె: రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పురస్కారాలు, బహుమతులు అందుకున్న ప్రముఖ బాడీ బిల్డర్ సుశీల్‌కుమార్ (26) గుండెపోటుతో మరణించారు. కర్ణాటక రాష్ట్రం దావణగెరెలోని కేటీ జంబణ్ణనగరకు చెందిన సుశీల్ మంగళవారం రాత్రి వ్యాయామశాల నుంచి ఇంటికి తిరిగి వచ్చిన అనంతరం అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు.



చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. ఆయన అప్పటికే కన్నుమూశారని వైద్యులు ధ్రువీకరించారు. అంతర్జాతీయ స్థాయిలో దేహదారుఢ్య పోటీలకు సుశీల్ సన్నాహాలు చేసుకుంటున్న తరుణంలోనే ఈ ఘటన జరగడం స్థానికులను కలచివేసింది. అతని తల్లి దేవమ్మ జిల్లా ఆసుపత్రిలో డిగ్రూపు ఉద్యోగిని. రక్తపోటు పడిపోవడంతో గుండెపోటు వచ్చి మరణించినట్లు వైద్యులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. దావణగెరె కేటీజే నగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# తర్వాత వాట్సప్‌నూ బ్యాన్ చేస్తారా? కేంద్రం తీరుపై రాహుల్ ఫైర్

ఢిల్లీ: నీట్ పునఃపరీక్ష నేపథ్యంలో ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్'పై కేంద్రం నిషేధం విధించడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. కేంద్రం చర్య దొంగను పట్టుకోవడానికి బదులుగా.. బాధితుడి ఇంటి తలుపునకు తాళం వేయడంలా ఉందంటూ ఎద్దేవా చేశారు. నోట్స్, టెస్ట్ సిరీస్‌లు, చర్చలు, ప్రిపరేషన్ కోసం లక్షలాది మంది విద్యార్థులు ఎప్పటినుంచో టెలిగ్రామ్ ను ఉపయోగిస్తున్నారని..



దీనిపై నిషేధం విధించడం వల్ల వారు నష్టపోయే ప్రమాదముందని పేర్కొన్నారు. అసలు ఈ ఆలోచన పేపర్ లీక్‌లు అరికట్టడానికి ఎలా ఉపయోగపడుతుందని ప్రశ్నించారు. నిందితులు టెలిగ్రామ్ కాకుంటే వాట్సప్‌లోనూ పేపర్లు లీక్ చేస్తారని అన్నారు. అలా అని వాట్సప్‌ను కూడా బ్యాన్ చేస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ నిషేధం తీరు పరీక్షల్లో మోసాలకు పాల్పడే పేపర్ లీక్ నెట్‌వర్క్‌లను కాకుండా, విద్యార్థులనే లక్ష్యంగా చేసుకున్నట్లుగా ఉందని రాహుల్ ఆక్షేపించారు. నీట్ అభ్యర్థులకు జరిగిన అన్యాయం నుంచి దృష్టి మరల్చడానికే కేంద్రం ఈ ఎత్తుగడ వేసిందని విమర్శించారు. దేశంలో పదేపదే పేపర్ లీక్‌లకు పాల్పడుతున్న నిందితులపై చర్యలు తీసుకోవడంలో మోదీ యంత్రాంగం విఫలమైందన్నారు. ప్రభుత్వ కనుసన్నల్లోనే పేపర్ లీక్ మాఫియా నడుస్తోందని.. దానిని కప్పిపుచ్చుకొనేందుకే పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా బలగాలను మోహరించడం, ప్రశ్నపత్రాలను వైమానిక దళం ద్వారా పంపించడం వంటి నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం మాట వినకపోతే తమ హక్కులను ఎలా సాధించుకోవాలో యువతకు తెలుసని అన్నారు.

# గర్ల్‌ఫ్రెండ్‌తో పెళ్లి కోసం రూ.4కోట్ల నగలు చోరీ

ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ఓ ప్రముఖ నగల దుకాణంలో భారీ చోరీ జరిగింది. ఈ ఘటనపై దర్యాప్తు చేసిన పోలీసులు విస్తుపోయే విషయాలు వెల్లడించారు. షోరూమ్‌లో పనిచేస్తున్న నితిన్ వర్మ అనే వ్యక్తి తన ప్రేయసి కాజల్ వర్మతో పెళ్లి కోసం ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నితిన్ అనే వ్యక్తి ప్లాన్ ప్రకారమే నెలన్నర క్రితం షోరూమ్‌లో చేరాడు. స్టోర్ అంతర్గత కార్యకలాపాలు, భద్రతా ఏర్పాట్లు, విలువైన ఆభరణాలు ఎక్కడ ఉన్నాయి? అనే కీలక విషయాలు తెలుసుకున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు.. తన ప్రియురాలు కాజల్‌తో వివాహం నిశ్చయమైందని జూన్ 12న నమ్మించి షోరూమ్ సిబ్బందికి మందు పార్టీ ఇచ్చాడు. ఈ పార్టీకి కాజల్ వర్మ, నిందితుడి తండ్రి కూడా హాజరయ్యారు. షోరూమ్ తాళాల బాధ్యత చూసే క్యాషియర్ గౌతమ్ రాజ్‌ను ఎక్కువ మద్యం తాగేలా ప్రోత్సహించి.. అతడిని ఇంటి దగ్గర దింపే నెపంతో తాళాల్ని కాజేశాడు. మరుసటి రోజు ఉదయాన్నే నితిన్ తన స్నేహితుడితో నగల దుకాణానికి వచ్చి.. దొంగిలించిన తాళం



చెవితో షట్టర్ తెరిచి లోపలికి వెళ్లాడు. కేవలం 25 నిమిషాల్లో మొదటి అంతస్తులో ఉన్న బంగారం, వజ్రాలు, రత్నాలు పొదిగిన రూ. 4 కోట్ల విలువైన ఆభరణాలను దోచుకొని అక్కడి నుంచి పరారయ్యారు. షోరూమ్‌లో ఎటువంటి అలారం వ్యవస్థ లేకపోవడంతో ఈ విషయాన్ని ఎవరూ గుర్తించలేకపోయారని పోలీసులు వెల్లడించారు. రాత్రిపూట కాపలాగా ఉండే సెక్యూరిటీ గార్డు ఉదయం 7గంటలకు ఇంటికి వెళ్లిపోయిన అనంతరం ఈ దోపిడీ జరిగిందని వివరించారు. పెళ్లి ఖర్చుల కోసమే ఈ దొంగతనం చేసినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ కేసులో నిందితుడు నితిన్‌తో పాటు అతడి తండ్రిని, ప్రేయసిని అరెస్ట్ చేశామని.. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోందని

# పీఎం కిసాన్ నిధులు విడుదల తేదీ ఖరారు

ఢిల్లీ: రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ నిధులు జూన్ 20న విడుదల కానున్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ చేయనున్నారు. పీఎం కిసాన్ పథకాన్ని 2019లో మోదీ సర్కారు ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు.

**మీ పేరుందా?**


పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం




పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్ధిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇకేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇకేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

# నా మాటలను బీప్ చేయొద్దు: సంజయ్‌రౌత్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే మరోసారి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. పలువురు ఎంపీలు ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనలో చేరనున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశానికి ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా రెబల్స్‌ను ఉద్దేశించి రౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన మాటలను బీప్ చేయొద్దని



పాత్రికేయులకు సూచించడం గమనార్హం. "ద్రోహులు వెళ్లిపోవాలి. అసమ్మతివాదులు మొదట రాజీనామా చేయాలి. పార్టీ టికెట్‌పై గెలిచినవారికి ప్రజాతీర్పును మోసగించే హక్కు లేదు. పార్టీ మారేందుకు కొందరు ఎంపీలకు రూ.50 కోట్లు ఆఫర్ చేస్తున్నారని తెలుస్తోంది. అయితే మాకు చీలిక గురించి అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. మీడియాలో చక్కర్లు కొడుతోన్న వార్తలతో ఈ విషయం మా దృష్టికి వచ్చింది" అని రౌత్ మాట్లాడారు. ఈ పరిణామాల నేపథ్యంలో శివసేన (యూబీటీ) చట్టపరమైన చర్యలు ప్రారంభించిందని చెప్పారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లో కూడా చీలికలు వచ్చాయి. వీటిని సంజయ్ ప్రస్తావించారు. చీలికలు ఇలా ఉంటే.. ఎన్నికల్లో పోటీపడటంలో అర్థమే లేదన్నారు. 2022 తరహా తిరుగుబాటు మరోసారి జరిగితే మహారాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఆ ఏడాది శివసేన రెండుగా చీలిపోయింది. అప్పటివరకు ఉన్న పార్టీ పేరు, గుర్తు ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని చీలిక వర్గానికి దక్కాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీ పేరు శివసేన (యూబీటీ) గా మారింది. లోక్‌సభలో శివసేన (యూబీటీ)కి తొమ్మిది మంది ఎంపీలు ఉన్నారు.

## వాళ్లు పరాన్నజీవులు..
# కఠినంగా ఉండాల్సిందే: సుప్రీంకోర్టు


ఢిల్లీ : దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సైబర్ నేరగాళ్లు అమాయక ఇన్వెస్టర్లను మోసగించి.. కోట్ల రూపాయలు దోచుకుంటున్నారంటూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి పరాన్నజీవుల పట్ల కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సైబర్ నేరారోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి వివిధ రాష్ట్రాల్లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఒక్కటిగా కలిపేయాలని కోరుతూ



దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణలో భాగంగా భారత ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు నిరాకరించారు. సైబర్ నేరాల బాధితులు దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉంటారని సీజేఐ అన్నారు. సైబర్ నేరస్థులు ఒక రాష్ట్రంలో పోలీసులకు దొరికితే మరో రాష్ట్రానికి వెళ్లి అక్కడి ప్రజలను దోచుకుంటారని.. వారిని జైల్లో ఉంచడమే ప్రజలకు మంచిదని పేర్కొన్నారు. గతేడాది చివరి నాటికి భారతీయులు డిజిటల్ మోసాల వల్ల రూ.3వేల కోట్లకు పైగా నష్టపోయారని.. దేశంలో సైబర్ నేరాల తీవ్రతను ఇది తెలియజేస్తోందని సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉపశమనం కోరేందుకు సంబంధిత హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించారు.

# తాత్కాలిక బ్యాన్‌ను ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన టెలిగ్రామ్

నీట్ పునఃపరీక్ష నేపథ్యంలో తప్పుడు ప్రచారాలకు కొన్ని ముఠాలు వినియోగిస్తున్న ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్' పై కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిషేధం విధించింది. ఈ చర్యలను టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ వ్యతిరేకించారు. పేపర్ లీక్ సమస్యను పరిష్కరించకుండా.. నిందితులపై చర్యలు తీసుకోకుండా యాప్‌ను నిషేధించడం ఏంటని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనివల్ల కోట్లాది మంది వినియోగదారులు ప్రభావితమవుతారన్నారు. టెలిగ్రామ్‌ను నిషేధించినంత మాత్రాన లీకులు ఆగవని.. నిందితులు ఇతర యాప్‌ల నుంచి కూడా అక్రమాలకు పాల్పడతారని అన్నారు. మరో వైపు ఈ నిషేధాన్ని టెలిగ్రామ్ సంస్థ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. దీంతో ఈ విషయంపై హైకోర్టు అత్యవసర విచారణ చేపట్టింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌ను బ్లాక్ చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. నీట్ రీటెస్ట్ జూన్ 21న నిర్వహిస్తుండగా.. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ తాత్కాలిక నిషేధం విధించినట్లు తెలిపింది. టెలిగ్రామ్‌లోని మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను కూడా నిలిపివేయాలని ఆదేశించింది. పరీక్షలు జరిగిన తర్వాత, టైమ్‌స్టాంప్‌ను అలాగే ఉంచుతూ, మెసేజ్‌లను ఎడిట్ చేయడం, ప్రశ్నలను చొప్పించడం ద్వారా 'పేపర్ లీక్' సాక్ష్యాలను సృష్టించడానికి ఈ ఫీచర్‌ను దుర్వినియోగం చేశారని ఎన్‌టీఏ ఆరోపించింది.




## అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్న
# ఇండో-అమెరికన్ వ్యోమగామి

ఇండో అమెరికన్ వ్యోమగామి అనిల్ మేనన్ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్నారు. జులై 14న ప్రారంభం కానున్న అంతర్జాతీయ అంతరిక్ష యాత్రకు అనిల్.. మరో ఇద్దరు వ్యోమగాములు ప్యోటర్ డుబ్రోవ్, అన్నా కికినాలతో కలిసి వెళ్లనున్నారు. వారు 240 రోజుల పాటు కక్ష్యలో గడపనున్నారు. జూన్ 22న అనిల్ మేనన్ ఇంటర్వ్యూలు ఇస్తారని నాసా వెల్లడించింది. భారత్, ఉక్రెయిన్ తల్లిదండ్రులకు జన్మించిన అనిల్.. అమెరికా పౌరుడు. 2021లో ఆయన వ్యోమగామిగా ఎంపికయ్యారు. 2024లో 23 ఆస్ట్రోనాట్ క్లాస్ గ్రాడ్యుయేట్ అయ్యారు. అంతకుముందు హార్వర్డ్ నుంచి న్యూరోబయాలజీలో బ్యాచిలర్ డిగ్రీ, స్టాన్‌ఫోర్డ్ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్, మెడికల్‌లలో మాస్టర్ డిగ్రీలను అందుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఈయన



వ్యోమగామిగానే కాకుండా ఎమర్జెన్సీ మెడిసిన్ ఫిజీషియన్, మెకానికల్ ఇంజినీర్, అమెరికా స్పేస్‌ఫోర్స్ కర్నల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వ్యోమగామి కాకముందు అనిల్ నాసా ఎక్స్‌పెడిషన్ ఫ్లైట్ సర్జన్‌గా పనిచేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం లోని వ్యోమగాములకు సహకరించేవారు. 2021లో నాసా తన వ్యోమగాముల బృందంలో అనిల్‌ను ఎంపిక చేసింది. రెండేళ్ల శిక్షణ తర్వాత 2024లో ఆయన వ్యోమగామిగా పట్టభద్రుడయ్యారు. నాటినుంచి కక్ష్యలోకి తన మొదటి అంతరిక్ష యాత్ర కోసం సిద్ధమవుతున్నారు.

# పాఠశాల కరిక్యులం ఎంపికలో కేంద్రం జోక్యం వద్దు: కేరళ సీఎం

పాఠశాలల్లో అమలుచేసే కరిక్యులం ఎంపిక చేసే విషయంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉండాలని కేరళ సీఎం వీడీ. సతీశన్ పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోకూడదన్నారు. కేంద్రం రూపొందించిన పీఎం శ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని పరిశీలించేందుకు నలుగురు మంత్రులతో కూడిన ఉపకమిటీని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఆయన అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం



తీసుకున్నట్లు బుధవారం విలేకరులతో చెప్పారు. ఈ పథకాన్ని అమలుచేసేందుకు పాఠశాలలను ఎంపిక చేసే విషయంలో కూడా రాష్ట్రానికే స్వేచ్ఛ ఉండాలని వ్యాఖ్యానించారు. ఈ పథకం కింద రాష్ట్రానికి రూ.99 కోట్లు అందాయని తెలిపారు. దీని అమలుకు గత ప్రభుత్వ హయాంలోనే ఒప్పందం జరిగిందని.. దీనికి సంబంధించిన నిధులను కూడా ఆ ప్రభుత్వమే తీసుకుందన్నారు. కాబట్టి అనివార్య పరిస్థితుల్లో దీన్ని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు.

